ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మే 1, 2011

ENTERED

పాపికొండల్లో ప్రయాణం

2011 హ్యాపీ బర్త్‌డే

(2011 మే 1 నుంచి
2011 మే 7 వరకు)

జి సాహితి
మే-2
శ్రీదేవి-సోము
దిల్‌సుఖ్‌నగర్-హైదరాబాద్

ప్రదీప్
9సం॥, మే-1
మాధవి-బసవయ్య
పిల్లాయిపల్లి-నల్లగొండ



సంస్కృతి
1సం॥, మే-5
శైలజ-సునీల్‌కుమార్‌రెడ్డి
ఐవాన్-అమెరికా

డి.ఎన్.వి అనిరుద్
మే-3
సంగీత-నరేందర్
ఇల్లందు-ఖమ్మం

పి.హరీష్
9సం॥, మే-6
వాణి-వేణు
వెంకంపేట-కరీంనగర్

ఆర్.మృదుల(అమ్ములు)
3సం॥, మే-2
అరుణజ్యోతి-వెంకటేష్
గోల్కొండచౌరస్తా-హైదరాబాద్

ఎల్. హేమంత్ సుధీర్
మే
హైమవతి-రమణయ్య
దరిశి-ప్రకాశం

బి. రాజశేఖరరెడ్డి
మే
పుష్ప-శ్రీను
భైరావునిపాడు-మంచిర్యాల

ఆర్. నాని
1సం॥,మే-3
కవిత-భానుచందర్
కోకాపేట-రంగారెడ్డి

శ్రీసాయిశ్రావ్య
మే
గోదావరి-సాయిగౌడ్
కొల్లూరు-నిజామాబాద్

బి.ధర్మసురేంద్రనాథ్
మే,4
అనూష-చంద్రబాబునాయుడు
హైదరాబాద్

మనలో మాట

నవ్వుల రోజు

నవ్వు మనిషికి పెట్టని ఆభరణం వంటిది. పైసా ఖర్చు లేకుండా ధరించగల్గిన నగ నవ్వు ఒక్కటే. అలాంటి నవ్వుల్లో ఎన్ని రాకాలున్నాయనీ! చిరునవ్వు, ముసి ముసి నవ్వు, మూగ నవ్వు, చిలిపి నవ్వు, సోడా బుడ్డి నవ్వు, కోతి నవ్వు, విషపు నవ్వు... చాలా వున్నాయి. అసలు ఇన్ని రకాలుగా ఎందుకు నవ్వుతాం? అనడిగితే మాత్రం చెప్పడం కొంచెం కష్టమే. ఆ విషయమై ఇప్పటికీ పరిశోధనలు నడుస్తూనే వున్నాయి. నవ్వు వల్ల లాభాలు మాత్రం మెండుగా వున్నాయంటున్నారు. విలన్ లాంటి ఒత్తిడిని లాగి లెంపకాయ కొట్టి పారగొట్టగల కలేజా నవ్వుకుందట. అంతేకాదు. కొన్ని రకాల క్యాన్సర్లను సైతం దూరం చేయగల దివ్యౌషధం నవ్వని చెప్తున్నారు. అందుకేనేమో నవ్వేవాడు భోగి నవ్వనివాడు రోగి అన్నారు పెద్దలు.

నవరసాల్లోకి హాస్యరసం రుచే వేరు. వయోబేధం లేకుండా అందరూ ఆస్వాదించే రసం. అసలు జీవితంలో ఒక్కసారైనా ఏడవని వారుండొచ్చు. మాట్లాడని వారుండొచ్చు. కానీ నవ్వని వారు వుండరేమో! అందుకే మన జీవితాల్లో హాస్యానికి అంత పెద్ద పీట వేశాం. పూర్వకాలంలో రాజులను, మంత్రులను అలరించడానికి విదూషకులను నియమించుకునేవారు. వారుకాక వికటకవులుండేవారు. ఇప్పుడు మాత్రం తక్కువ తిన్నామా! మన మాటల్లో, పాటల్లో, ఆటల్లో, టీవీలో, రేడియోల్లో, పత్రికల్లో...హాస్యం వుండితీరాల్సిందే. ఎవరినైనా వర్ణించేప్పడు వాడిది 'నవ్వు మొహం' అంటాం. ఆమె నవ్వు జలపాతంలా వుందంటాం. సినిమాల్లో హాస్య చిత్రాలది ప్రత్యేక స్థానం. ఇక హాస్య నటీనటుల గురించి చెప్పేదేముంది! ప్రేక్షకుల మదిలో వారిదెప్పడూ చిరస్థానమే. చార్లీచాప్లిన్ అలా తెర మీద కనిపిస్తే చాలు. సినిమా హాల్లో నవ్వులు పూస్తాయి. రాజబాబు, రేలంగి, రమణారెడ్డి, బ్రహ్మానందం, ఆలీ, శ్రీలక్ష్మి, కోవై సరళ...అంతా హాస్య రాజులు, రాణులే. ప్రతి చిత్రంలోనూ కామెడీ ట్రాక్ తప్పనిసరి. మరి సినిమా హిట్టవ్వాలంటే ఆ మాత్రం కామెడీ వుండొద్దూ. ఇంక నవ్వు మీద సినిమా పాటలు ఎన్ని కట్టారో! 'సిరిమల్లె పువ్వల్లె నవ్వు...చిన్నారి పాపల్లె నవ్వు', 'నవ్వవయ్యు బాబూ... నీ సొమ్మేం పోతుంది'...అలాంటివే. కామెడీ షోలు, పపెట్ షోలు, వికటకవులూ, కార్టూన్ చానెళ్లూ లేని టీవీలను ఊహించగలమా! జోక్‌లు, కార్టూన్లు, సెటైర్లు లేని పత్రికలను పాఠకులు ఆదరిస్తారా! హాస్య కథల పోటీలకూ కొదవులేదు. ఆఖరికి అందాల పోటీల్లోను నవ్వును చేర్చేశారు. 'మిస్ స్మైల్' కిరీటం కోసం ఎంతగా పోటీపడతారో చెప్పేదేముంది!

ప్రపంచ భాష ఏదయ్యా అంటే ఇంగ్లీషు అంటారేమో! కానే కాదు. ఆ దేశం, ఈ దేశం, జ్ఞాని, పామరుడు అన్న తేడా లేకుండా అందరూ మాట్లాడగలిగే భాష నవ్వు. ప్రపంచంలో ఏ ఫొటోగ్రాఫర్ నోటినుంచైనా వచ్చే మాట 'స్మైల్ ప్లీజ్'. ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు లియొనార్డో డావిన్సీ కుంచె నుంచి జాలువారిన 'మొనాలిసా' నవ్వుకు ఎందరు ఎన్ని భాష్యాలు పలికారో చెప్పకోవాలంటే రోజులు కాదు.. సంవత్సరాలు కూడా సరిపోవేమో! విదేశాల్లో నవ్వుల చికిత్స కూడా చేస్తున్నారంటే నవ్వొస్తుంది. ఇంత ప్రాధాన్యత వుంది కనకే నవ్వు కోసం ప్రపంచవ్యాప్తంగా ఒక రోజునే (మే 2) కేటాయించుకున్నాం.

ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ నవ్వోమీటరుతో పరీక్షించుకోవాలి. నవ్వోమీటరు థర్మామీటరులాంటిదే. దాన్ని బట్టే మనలో హాస్యం ఏపాళ్లలో వుందో తెల్సుకోవచ్చు. అయితే నవ్వబోయేముందు కాస్త చూసుకొని నవ్వాలి. ఎదుటివారు బాధలో, కష్టంలో వున్నప్పుడు నవ్వితే లేనిపోని ఇబ్బందులు రావొచ్చు. కాబట్టే హాస్యానికి అపహాస్యానికి తేడా కూడా తెలియాలి. హాస్యం పేరుతో అపహాస్యానికి పూనుకుంటే పరిణామం విషాదమే. సదా స్మరణలో వుంచుకోవాల్సిన విషయమిది.

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
సినిమా కబుర్లు	...	8
రుచి	...	10
కొత్త పుస్తకాలు	...	11
అట్టమీది కథ	...	14
కథ	...	18
వికాసం	...	20
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

మేడే నాడు ఏం జరిగింది?
ప్రత్యక్షసాక్షి కథనం...4

చూద్దామా 12
ఒంటరి విహార యాత్ర

ఈ పేజ్ ... 21
ప్రపంచం మీ అరచేతిలో!



ఇంటర్వ్యూ బాగుంది

నలభై వసంతాల కులనిర్మూలన సంఘ అధ్యక్షునితో ఇంటర్వ్యూ బాగుంది. కులాంతర వివాహితులు కుల రహితులుగా ఉండాలి. కుల ఆచార సంప్రదాయాలు విడనాడాలి. ఆ వ్యవస్థలో ఉండే దుర్మార్గాలను అర్థం చేసుకోవాలి. కులాంతర వివాహాలు సామాజిక మార్పుకు దోహదపడతాయి. కానీ అదే సమయంలో గౌరవ హత్యలు కూడా పెరిగిపోతున్నాయి. కుల నిర్మూలనను రాజ్యాంగంలో చేర్చితే బాగుంటుంది.

టి. శ్రీరామ్మూర్తి, గాజువాక.

వెల కట్టలేని 'యానాం'

ఈ వారం స్నేహ ఎనలేని స్నేహాన్ని పాఠకులతో పంచుకుంది. కుటుంబమంతా ఏ ఒక్క శీర్షికనూ వదలకుండా చదివేంతగా ఆకట్టుకుంది. ముఖ్యంగా కవర్ స్టోరీ 'జీవనయానాం' ప్రకృతి అందాలకే వన్నె తెచ్చింది. నిండైన భారతీయతకు అద్దం పట్టిన 'యానాం' విలువ కట్టలేం. మంచి అంశంతో అట్టమీది కథకు నిండుతనం తెచ్చారు. 'నవ్వుల్ - పువ్వుల్' కడుపుబ్బ నవ్వించాయి. 'వృత్తి... ప్రవృత్తి...' కథలో భర్త భార్యకిచ్చే నిజమైన బహుమానం ఆమెలోని కళను గౌరవించడమే.

టి.వి.డి.ఎస్. సీతారామారావు, విజయవాడ.

మరికొన్ని వివరాలు...

'చూద్దామా'లో రోమ్ రమ్మంటోంది... విశేషాలు ఆకట్టుకున్నాయి. పురాతన కట్టడాలు, ఆలయాల గురించి తెలిపారు. నాటి ప్రజల దయనీయ స్థితి, బానిసలతో నాటి నేతలు ఆడే వికృత క్రీడల గురించి ప్రస్తావించారు. కానీ ఆనాటి ప్రజల స్థితిగతులతో కూడిన వివరాలు మరికొన్ని ఇస్తే బాగుండేది. కేవలం నేటి విషయాలను మాత్రమే తెలిపారు. కప్పుకు 10 కారణాలు వ్యాసం ఆకర్షించింది. భారత ఆటగాళ్లైన సెహ్వాగ్, గంభీర్, సచిన్, యువరాజ్, ధోనీ... వంటి హేమాహేమీల ఆటతీరు కన్నుల పంటగా వుంది. ఈ విశ్వవిజేతలు తమ స్థానాన్ని నిలబెట్టుకోవడం, కప్పును సచిన్‌కు బహూకరించడం ఎంతో ఆనందం కలిగించింది.

నూతి నారాయణరావు, గడ్డి అన్నారం.

అభినందించాల్సిందే...

'అట్టమీది కథ'లో యానాం విశేషాలన్నీ కళ్లకు కట్టినట్లు అందించారు. శ్రీనివాసశాస్త్రి గారి 'వృత్తి... ప్రవృత్తి...' కథ బావుంది. అసూయను ఎలా జయించాలో సర్వేశ్వరశర్మగారు 'వికాసం' శీర్షికలో చక్కగా తెలియజేశారు. 'ఆలయాల గ్రామం' చిత్రాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. సినిమా కబుర్లు ద్వారా ఆమె మన తెలుగమ్మాయే అనుకునే మళయాళీ సుజాత గారి జ్ఞాపకాల్లో మునిగిపోయాం. 'బొమ్మల లైబ్రరీ' అనే ఆలోచనకు అంకురార్పణ చేసిన 'శివలాల్ దేశాయ్'ను అభినందించాల్సిందే. ఎన్ని చర్చిలున్నా 150 సంవత్సరాల కాలాన్ని వెచ్చించి నిర్మించిన 'సెయింట్ పీటర్స్ కాథడ్రిల్ చర్చి' రోమ్ నగరంలో ఏమూల నుండి చూసినా కన్పించడం నిజంగా అత్భుతమే! బంగారం మాటున ధగధగలున్నాయి...భగభగలూ ఉన్నాయన్న మాటతో ఎవరూ విభేదించరు.

నేమాన సుభాష్ చంద్రబోస్, శ్రీకాకుళం.

కొత్త కోణం

ఈనెల 10వ తేదీ నాటి స్నేహలో భమిడిపాటి గౌరీశంకర్ 'నీవు ఇక్కడకు రావద్దు...' కథలో కొత్త కోణాన్ని వెలికి తీశారు. తల్లిదండ్రులు తమకు ఆచరణ సాధ్యం కాని ఆశలు పిల్లల ద్వారా నెరవేరాలనుకుంటారు. దాని వల్ల పిల్లలు అయోమయంలో తమ ముందున్న కర్తవ్యాన్ని గుర్తించడంలో వెనుకబడుతున్నారు. అలా వారిని తయారు చేయడం తల్లిదండ్రులదే తప్పన్నట్లుగా చెప్పారు. కొడుకు తన తప్పును గుర్తించినట్లుగా అతని



ఉత్తరం ద్వారా తెలియజేయడం బాగుంది. గొప్ప గొప్ప ఆశయాలనుకుని ప్రకృతి నియమాలను దూరం చేసుకునే సంస్కృతి సమాజానికి ప్రమాదకరం.

మురళీధర్, విజయవాడ.

పరిష్కారం ఒక్కటే...

ఆచారాల పేరిట బలవుతున్న బసవి, జోగిని, శివపార్వతుల సమస్యకు పరిష్కార మార్గం ఒక్కటే. ప్రభుత్వమే ఒక నిపుణుల కమిటీవేసి ఈ దుష్ట సంస్కృతీ సంప్రదాయాన్ని నిషేధించాలి. పిల్లల బంగారు భవిష్యత్తును కాలరాసే హక్కు తల్లిదండ్రులతో సహా ఎవరికీ లేదనే నిజాన్ని గ్రహించాలి. ఇరవై ఎనిమిదేళ్ల తర్వాత క్రికెట్ ప్రపంచ కప్పు విజయానికి దారితీసిన తీరుతెన్నులను, ఆటగాళ్ల లోటుపాట్లను, ప్రతిభను నిర్మొహమాటంగా 'కప్పుకు 10 కారణాలు' లో హసన్ షరీఫ్ విశ్లేషించారు. భమిడిపాటి గౌరీశంకర్ కథ 'నీవు ఇక్కడకు రావద్దు' కథ ప్రస్తుత సమకాలీన సామాజిక అనివార్య వాస్తవం. నేడు ఏ విద్యార్థీ తన సొంత అభిరుచితో విద్యనభ్యసించినట్లు కనిపించదు. 'ఎవరు దిక్కు, శిల్పం జన్మించాలి' కవితలు బాగున్నాయి. 'చూద్దామా'లో పల్లెకు పోదాం... విశేషాలు చదివి, అక్కడి చిత్రాలు చూసి ఆశ్చర్యపోయాం.

ఖైరి సత్యనారాయణ, కొత్త గూడెం.



SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...

సులభ సూత్రాలతో

ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:

0-97890 99589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside: Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near: Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex, D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239, 99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709, 92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

తెలుసుకుందామా...

మేడే నాడు ఏం జరిగింది?

ప్రత్యక్ష సాక్షి కథనం

ప్రపంచ కార్మికుల పోరాట స్ఫూర్తికి సంకేతమైన మే దినోత్సవానికి కారణమైన చికాగో ఘటనల ప్రత్యక్ష సాక్షి కథనం ఇది. అమెరికాలోనే గాక ప్రపంచ వ్యాపితంగా పోరాటాల మాతృమూర్తిగా మన్నన పొందిన మదర్ జోన్స్ జ్ఞాపకాల పునర్ముద్రణ. జోన్స్ అసలు పేరు మేరి హారిస్ (1837-1930) ఐర్లాండులో పుట్టిన జోన్స్ కుటుంబం ఆమె శైశవ దశలోనే కెనడా వలస వెళ్లింది. దర్జీగా పని చేసే మేరీ ఇంట్లో 1871లో అగ్ని ప్రమాదం జరిగి భర్త, నలుగురు పిల్లలు మరణించారు. తర్వాతి కాలంలో ఆమె పూర్తిగా కార్మికోద్యమానికి అంకితమైనారు. ప్రత్యేకించి గని కార్మికుల మధ్య పని చేస్తూ అనేక సమ్మె పోరాటాలు జయప్రదం చేశారు.1890ల నుంచి ఆమెను ప్రత్యేక గౌరవాభిమానాలతో మదర్ జోన్స్ అని పిలవడం మొదలెట్టారు. కార్మికుల హక్కల కోసం పోరాడటంతో పాటు బాల కార్మికుల సమస్యను తెరపైకి తెచ్చిన వ్యక్తిగా ఆమెను ప్రత్యేకంగా చెప్పుకుంటారు. మంచి వక్త, సమరశీల నేత. హే మార్కెట్ చౌక్‌లో నాడు జరిగిన కాల్పుల నేపథ్యాన్ని ఆ మె సాధికారికంగా అక్షరీకరించారు.

1880 తర్వాత కాలంలో నేను పూర్తిగా కార్మికోద్యమంలో మునిగిపోయాను. ప్రధానమైన కార్మిక కేంద్రాలన్నిటా తిరుగుబాటు వెల్లువ. ఐరోపా నుంచి జరిగిన బ్రహ్మాండమైన వలసలతో మురికి వాడలు కిక్కిరిసి పోయాయి. అమెరికా కార్మికుల వేతనాల కోతకూ, జీవన ప్రమాణాల విధ్వంసానికి అది కారణమైంది. దేశమంతటా వ్యాపార మాంద్యం, విపరీతమైన నిరుద్యోగం పెరిగాయి. నగరాల్లో ఆకలి మంటలు, చిరుగు పాతలు నిరాశా నిస్పృహలు అలుముకున్నాయి. ఐరోపాలో నియంతల కింద మగ్గిపోయిన విదేశీయులు కార్మికులకు రకరకాలైన ఆర్థిక విమోచన మార్గాలు ప్రబోధించారు. కార్మికులు మాత్రం తిండి కావాలని, సుదీర్ఘమైన పని గంటలు తగ్గించాలని మాత్రమే కోరారు. పోలీసులు వారిపై లాఠీ, దెబ్బలు కురిపించారు.

మరీ ముఖ్యంగా చికాగో నగరం సమ్మెల పరంపరకు కేంద్రమైంది. తర్వాత అల్లర్లు బహిష్కరణలు. 1886కు ముందు కాలంలో నౌకా కేంద్ర కార్మికులు ట్రాముల కార్మికులు సమ్మెలు చేశారు. ఈ సమ్మెలను పోలీసులు, కిరాయి గుండాలు పాశవికంగా అణచివేశారు. కార్మికుల సమస్యలను పట్టించుకున్నవారు లేరు. వేతనాలు పని గంటలను గురించి ప్రశాంతంగా చర్చించుకోవడానికి ప్రశాంతంగా సమావేశాలు జరుపుకునే వారి పట్ల జాన్ బాన్‌ఫీల్డ్ అనే పోలీసు ఇన్‌స్పెక్టర్ మరీ క్రూరంగా వ్యవహరిస్తుండేవాడు. యజమానులు దేన్నీ ఖాతరు చేయకుండానే కార్మికుల గురించిన తమ భయాలను ఆగ్రహ ద్వేషాలను వ్యక్తం చేసేవారు. యజమానుల పత్రిక 'చికాగో ట్రిబ్యూన్' పారిశ్రామిక కేంద్రాలలో గుమికూడే దేశ దిమ్మరులను తక్కిన పురుగులలాగే చూస్తారని రాసింది.

ఎనిమిది గంటల పని వుండాలని కార్మికులు ఆందోళన ప్రారంభించారు. ట్రేడ్ యూనియన్లు, కార్మిక యోధుల సమితి ఈ ఉద్యమాన్ని బలపర్చింది. ఈ ఉద్యమ నాయకులలో చాలా మంది విదేశీయులు కావడంతో అసలు ఈ ఉద్యమాన్నే విదేశీయమైందని, అమెరికనేతరమైందని చిత్రించారు. తర్వాత చికాగో అరాచక కూటమి అనే చాలా చిన్న వేదిక కూడా ఎనిమిది గంటల పని దినాన్ని గట్టిగా కోరింది. ఆ తర్వాత దశలో చికాగో ప్రజలు ఎనిమిది గంటల పని అన్న సమస్యను కేవలం ఆర్థిక కోణం నుంచి చూసే బదులు అరాచకత్వంపై ఆవేశంతో కలగాపులగం చేయసాగారు.

ఆ అరాచక వాదపు బూచిని ప్రధానంగా చూపిస్తూ యజమానులు సమ్మెను కాలరాచివేయడానికి తెగబడ్డారు. ఎనిమిది గంటలే పని వుండాలని కోరేవాడు దేశానికి శత్రువని వారు ప్రచారం చేశారు. వారంతా ద్రోహులని అరాచకశక్తులని తిట్టిపోశారు. అరాచకపు ఎలుకపిల్లలు ప్రభుత్వాన్ని కొరికిపారేస్తున్నాయని చిత్రించారు. తీవ్రమైన ద్వేషభావాలు ప్రబలాయి. నగరం రెండు ఆగ్రహోదగ్ర శిబిరాలుగా చీలిపోయింది. ఒక వైపున ఆకలి దప్పులతో చలి బాధతో ఉద్యోగాలు కోల్పోయిన శ్రామిక ప్రజానీకం వట్టి చేతులతోనే కిరాయి గూండాల పోలీసుల తుపాకులను ఢీకొనాల్సిన స్థితి. ఆకలి చలి బాధలే తెలియని యజమానులు పోలీసులు పత్రికల మద్దతుతో సర్వ శక్తివంతమైన రాజ్యం ఆసరాతో మరో వైపు మోహరించారు.

సర్వత్రా ప్రబలిపోయిన అసంతృప్తిని ఆధారం చేసుకుని తమ సిద్ధాంతాలు ప్రబోధించేందుకు అరాచక వాదులు సిద్ధమైనారు. మిచిగాన్ సరస్సు తీరాన ఎండిన తిన్నెలపై వక్తలు పెద్ద జన సందోహాలనుద్దేశించి ఉపన్యాసాలు దంచేవారు. నేనెప్పుడూ అరాచకవాదాన్ని సమర్థించలేదు. కాని ఆ సరస్సు తీరంలో జరిగే సమావేశాలకు హాజరై నూతన సమాజ బోధకులు కార్మికులకు ఏం చెబుతున్నారో ఆలకించేదాన్ని.

ఈలోగా పార్టీ మార్గంలో జార్జి ఎం పాల్‌మెన్ భవంతి ముందుగాని కార్పొరేట్ వాజ్యాలలో ఆరితేరిన న్యాయవాది వెర్ట్ డెక్స్టర్ నివాసంలో గాని యజమానులు సమావేశం జరుపుకొన్నారు. ఎనిమిది గంటల పని దినం కోసం సాగుతున్న ఉద్యమాన్ని, దాని తారాస్థాయిగా జరిగే

సార్వత్రిక సమ్మెను ఎలా పీక నులిమేయాలా అని మంతనాలు జరిపారు. అరాచక వాదుల సమావేశాలను చెదరగొట్టే మార్గాలను కూడా చర్చించారు.

అత్యంత దారుణమైన శీతాకాలం ప్రవేశించింది. ఎడతెగని నిరుద్యోగం అంతులేని కడగండ్లకు దారి తీసింది. సూప్ పోసే కేంద్రాలు అన్నార్తులకు ఏ మూలకూ చాలలేదు. వేలాది మంది అసలైన బాధలంటే ఏమిటో స్వయంగా చవి చూశారు.

క్రిస్మస్ రోజున వందలాది మంది నిరుపేద ప్రజానీకం చింకి పాతలతో, చివికిపోయిన పాదరక్షలతో, సంపన్నుల సౌధమైన ఫ్యాషన్ల కేంద్రం పారీ అవెన్యూ ముందు నల్లజెండాలతో కదం తొక్కారు. అరాచకవాదులు ఆ ప్రదర్శన జరపడం అవివేకపు పని అని నేను అనుకున్నాను. ఎందుకంటే అప్పటికే పేరుకుపోయిన ద్వేషాన్ని అది మరింత తీవ్రం చేసింది. వాస్తవానికి దానిలో ఎలాంటి విజ్ఞానాత్మకమైన అంశం లేదు. యజమానుల భయాందోళనలను ఇంకా పెంచడానికే కారణమైంది. పోలీసులను మరింత అమానుషంగా మార్చింది. శ్రమజీవుల నిజమైన బాధల పట్ల సాధారణ ప్రజానీకంలో సానుభూతిని తగ్గించడానికి దారి తీసింది.

ఎనిమిది గంటల పని సమ్మెకు నాంది పలికే మే ఒకటవ తేదీ వచ్చేసింది. ప్రజలను హడలెత్తించడానికి పత్రికలు చేయగలిగినంతా చేశాయి. నగరమంతటా సమ్మెలు, వాకౌట్లు జరుగుతున్నాయి. యజమానులు మొదలంటా కంపించి పోయారు. వారికి విప్లవం వచ్చేసినట్లే కనిపించింది. మాక్రోమిక్ హార్వెస్టర్ వర్క్స్ ఫ్యాక్టరీ కార్మికులు ఆవరణ బయట గుమికూడారు. సమ్మెలో చేరకుండా లోపలే వుండిపోయిన వారిని గజ్జికురుపులంటూ కేకలు వేశారు. ఇటుక రాళ్లు విసిరేశారు. కిటికీలు ధ్వంసం చేశారు. ఆ ద్రోహులను బెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఎవరో దొమ్మీ జరుగుతుందంటూ పోలీసులకు ఫోన్ చేశారు.

పోలీసులు వచ్చీ రాగానే ఎలాంటి హెచ్చరిక లేకుండా లాఠీలతో విరుచుకుపడ్డారు. సమూహం మధ్యలోకి తూటాలు కురిపించారు. వారి గుర్రాల డెక్కల కింద ఎందరో నలిగిపోయారు. మరెందరో కాల్చివేయబడ్డారు. తలలు పగిలిపోయాయి. యువతీ యువకుల ప్రాణాలు బలైనాయి.

పూర్వపు బందిపోట్లతో గూండాలతో ఏర్పడిన పింకర్టన్ ముఠా రోజుకు ఎనిమిది డాలర్ల చొప్పున తీసుకుని పెట్టుబడిదారుల తరపున రంగంలోకి దిగింది. వారు ఫ్యాక్టరీ గేట్ల ముందు పికెటింగులు చేసి కావాలని కల్లోలాన్ని రెచ్చగొట్టారు.

మే 4న అరాచకవాదులు ఇక మురికైన ఇరుకైన జిల్లా కేంద్రంలో సమావేశం జరిపారు.



మదర్ జోన్స్

అక్కడ రైల్వే ట్రాకులు, ఇరుకు సెలూన్లు,పేదల మురికి వాడలు తప్ప మరేమీ లేవు. ఈ ప్రదేశమే తర్వాత చరిత్రలో హే మార్కెట్ స్క్వేర్ (చౌక్)గా పేరొందింది.అక్కడకు కాస్త దూరంలో డిస్‌ప్లెయిన్స్ స్ట్రీట్ పోలీసు స్టేషన్ వుంది. జాన్ బాన్‌ఫీల్డ్ దానికి ఆధ్వర్యం వహిస్తున్నాడు. అతను ఏ మాత్రం నైపుణ్యం గాని విచక్షణా జ్ఞానం గాని సానుభూతి గాని లేని మనిషి.పారిశ్రామిక అశాంతిని క్రూరంగా అణచివేయడమే మార్గమని గట్టిగా నమ్మిన వ్యక్తి.

చికాగో మేయర్ కార్టర్ హారిసన్ అరాచక వాదులు జరిపిన ఆ సమావేశానికి హాజరై స్వేచ్ఛగా తిరిగాడు. అక్కడి నుంచి వెళ్లగానే నేరుగా పోలీసు కేంద్ర కార్యాలయం చేరాడు. అక్కడకు ఆయుధ దారులైన అశ్విక పోలీసులను పంపించవద్దని ఆదేశించాడు. ఆ సమావేశం ప్రశాంతంగా జరుగుతున్నందున వీరు వెళితే కార్మికుల మనస్సులో దాగి వున్న ఆగ్రహం పెల్లుబికి రావచ్చన్నది ఆయన అంచనా. అయితే మరో వైపు నుంచి ఇందుకు భిన్నమైన ఆదేశాలు వచ్చినట్టుంది. మేయర్ నివేదికను ఖాతరు చేయకుండా పోలీసు ప్రధానాధికారి అశ్విక పోలీసులను అక్కడకు పంపించాడు.

ఆ సమయంలో అరాచకవాద వక్త ఫౌకరు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్నాడు. చౌకు కనిపించేలా వున్న ఒక కిటికీ లోంచి ఎవరో విసిరిన బాంబు మధ్యలో వచ్చి పడింది. దాని పేలుడులో అనేక మంది పోలీసులు మరణించారు.

నగరం ఉన్మాదంతో వూగిపోయింది.. దాన్ని మరింత ఉన్మాదంలోకి నెట్టడానికి పత్రికలు చేయగలిగినంతా చేశాయి. న్యాయం కోసం కార్మికులు వేస్తున్న పొలికేక ప్రతీకార ఘోషల్లో కలిసిపోయింది. అయిదు నిముషాలకు ఒక బాంబు దొరికిందని చెబుతూ వచ్చారు. ప్రతివారూ ఆయుధాల చేబూనారు. తుపాకుల కొట్లు రాత్రి వేళల కూడా తెరిచే వుంచారు. వందలాది మందిని అరెస్టు చేశారు. కేవలం ఎనిమిది గంటల పని కోసం ఉద్యమించిన వారిని మాత్రమే విచారణ బోనులో నిలబెట్టారు. కొద్ది మాసాల తర్వాత వారిని ఉరి తీశారు. నిజంగా ఆ రోజున బాంబు విసిరిన సాక్నుబెల్ట్‌ను మాత్రం ఏ కోర్టు అంటుకోలేదు. ఆ భయానక నాటకంలో అతని పాత్ర ఏమిటో ఏనాడూ అధికారికంగా ప్రకటించలేదు.

ఎనిమిది గంటల పని ఉద్యమ నాయకులను నవంబరు 11, శుక్రవారం ఉరి తీశారు. ఆ రోజున చికాగోలో సంపన్నులు చిందులు తొక్కారు. జైలు నుంచి అన్ని దిశలకూ తాడు అడ్డం కట్టారు. దొమ్మీ తుపాకులు పట్టుకుని పోలీసులు తాడు పొడుగునా నిలబడ్డారు. జైలు మార్గాలన్నిటా ప్రత్యేక గస్తీ దళాలను నియమించారు.ఆ జైలు రాతి గోడలు పోలీసుల వల్ల నల్లబడ్డాయి. తిరుగుబాటు కథనాలు జైలులో ప్రసంగాల వార్తలతో పత్రికలు ప్రజల బుర్రలకు మేత వేశాయి.

అయితే తిరుగుబాట్లు లేవు. జైలులో ప్రసంగాలు కూడా లేవు. నిజంగా హింసను ప్రబోధించే లూయిస్ లగ్ ఒక్కడే అలాంటి పని చేశాడు. అతను బిగుతైన టోపీ పెట్టుకుని తలను ముక్కలు చేసుకోవడం ద్వారా ఉరి కంబాన్ని ధిక్కరించాడు.

ఉరితీతల తర్వాత ఆదివారం అంత్యక్రియలు జరిగాయి.వందలాది మంది కార్మికులు మృతదేహాల అంతిమ శకటం వెనక నడిచారు. వారంతా అరాచక వాదులు కారు. వారి సిద్ధాంతాలేమైనప్పటికీ ఈ వ్యక్తులు కార్మికుల పోరాటం కోసం ప్రాణాలిచ్చినందుకు నివాళు లర్పించారు. నిశ్శబ్దంగా వీక్షిస్తున్న వందలాది ప్రజలతో కిక్కిరిసిన వీధులలో వారు మైళ్ల తరబడి నడిచారు.

వాల్దోహిం శ్మశాన వాటికలో వారిని సమాధి చేశారు. అయితే ఆశయం మాత్రం వారితో పాటు భూస్థాపితం కాలేదు. ఎనిమిది గంటల పని కోసం మరింత మానవీయమైన పని పరిస్థితుల కోసం మనుషుల మధ్య సరైన సంబంధాల కోసం పోరాటం మరింతగా ముందుకు సాగింది. ఇంకా సాగుతున్నది.

ఏడేళ్ల తర్వాత గవర్నర్ ఆల్ట్జెల్డ్ ఈ కేసులోని సాక్ష్యాలన్నీ అధ్యయనం చేశాడు. ఉరి శిక్ష తప్పించుకుని జైళ్లలో మగ్గిపోతున్న ముగ్గురు అరాచక వాదులకు శిక్ష మాఫీ చేశాడు. ఆ తీర్పు సమర్థనీయం కాదని ప్రకటించాడు. శిక్షల అమలు సందర్భంలో విలియం డీన్ హొవెల్స్, విలియం మోరెస్ కూడా అదే అన్నారు. సాహసోపేతమైన ఈ చర్య వల్ల గవర్నర్ అట్జెల్డ్ రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నాడని భావించినప్పటికీ సత్యాన్ని ప్రేమించేవాళ్లు దాన్ని ప్రకటించేవాళ్లు ప్రతివారి హృదయాల్లో ఆయన నిలిచిపోయాడు.

★

జీవన నృత్యం

గది తలుపులు బద్దలై
ప్రసవం కేకలు బైటపడ్డాయి
ఊపిరి క్రమబద్ధీకరించి
రక్త సంబంధం నిరీక్షిస్తూ ఉంది
క్షణాలు లెక్కిస్తూ ప్రసూతి కేంద్రం
అత్యవసర సేవలో నిమగ్నమైంది
నిశ్శబ్దాన్ని శబ్దమయం చేస్తూ
కెవ్వుమన్న రక్తపు ముద్ద ఏడుపు విని
మనోఫలకంపై మనసు రాసింది
కాలం సృష్టికర్తని
వర్షం పాయలో నీటి పడవలు
రాజసం ప్రదర్శిస్తున్నాయి
గాలిపటాలు సప్తవర్ణాలై
ఆకాశం ఎత్తులు కొలుస్తున్నాయి
తారాజువ్వలా బిళ్లంగోళ్లు
పరుగు ప్రదర్శనలు చేస్తున్నాయి
పలకాబలపం పట్టిన చిన్నారుల ధ్యాస
ఏడవ ఎక్కం గుక్కపట్టింది
సుమతి వేమనలు బెత్తం పట్టి
పద్యాలు కంఠస్తం చేయిస్తున్నారు
నడుస్తున్న చరిత్ర చెప్పింది
కాలం బాల్యమని
అరవిరిసిన పువ్వులు
తురుముకుంటూ ఒక సిగ
కొంటె చూపులు చూస్తూ
దోర వయసు కోడెగాడు
చెట్టాపట్టాలేసుకుని
గట్లపై పరుగులు తీస్తూ యవ్వనాలు
ప్రేమ విరహాల మధ్య ప్రయాణిస్తూ
యుక్త వయసులు
మాతృదేశ భవిష్యత్తుకు
ఎలుగెత్తిన యువకులు
ఉద్గ్రంథంలో ఒక అధ్యాయం తెలిపింది
కాలం యవ్వనమని
చూపులు చీకట్లయి
కళ్లు కాయలు కాశాయి
కాళ్లు మూడై
నడకలు మందగించాయి
బాధ్యతలు బరువులై
నడుములు వంగి పోయాయి
ఆర్థిక తరగతిలో
అనురాగం నుగ్గయింది
జగన్నాటకంలో చరమాంకం ప్రదర్శితమైంది
కాలం వృద్ధాప్యమని
కాలం చతుర్విధగతులు
చతుర్విధనర్తనాలు!

- అడిగోపుల వెంకటరత్నమ్

ఊహ!... అపోహ!!



కొన్ని ఊహలు
నిజాలు కాలేవు!
కొన్ని ఊహలు
అబద్ధాలుగా మిగిలిపోవు!!
కొన్ని చూపుల్లో తేడాలున్నట్లు
కొన్ని నిజాల్లో దాగుంటాయి
కొన్ని అబద్ధాలుగా ఒదుగుంటాయి
మరికొన్ని ఊహలు అపోహలుగా
చిత్రించుకుంటాయి!!!
వాస్తవ రూపమెప్పుడూ
చేదుగా ఉండొచ్చు!
నిజమెప్పుడూ నిప్పులానే
మండుతుంది!!
అది మంచి చెడులన్నింటినీ
దహించిపారేయగలదు!
నిజమెప్పుడూ అబద్ధమే!!
నిజం వెలుతుర్ని చిందిస్తే
అబద్ధం అర్ధరాత్రిలా భయపెడుతుంది!!!
అలాగని
పగలెప్పుడూ పగలు పెంచదు!
రాత్రెప్పుడూ
అరాచకాన్ని సృష్టించదు!!
సమయం, సందర్భాన్ని బట్టి
ఊహ అపోహ బురదలోకి
కళ్లకి పట్టిన మబ్బుల్లోకి దూరి జారిపడినప్పుడు
నాశనం, వినాశనమే కదా!
నిజానికి, అబద్ధానికి మధ్య
నిల్చిన సన్నని గీత
ఊహకి, అపోహకి మధ్య ఉన్న చిన్న తేడాలాంటిదే కదా!!
అవును!... ఊహ ఎప్పుడూ
ఉసిరి లాంటి ఆరోగ్యకర అద్భుతాలను
సృష్టించాలిగాని
అపోహలాంటి చేదు మాత్రలని మింగించకూడదు కదా!!!
అవును కదా... అవునవును కదా!!

- చలపాక ప్రకాష్

నవ్వుల్ - పువ్వుల్

భళారే

సప్లయర్ : టిఫిన్ ఏం తీసుకురమ్మంటారు?
కష్టమర్ : సింగిల్ ఇడ్లీ, బక్కెట్ సాంబార్.

భలే బావ

బావమరిది : బావా! నా అప్పులు తీరడానికి మంచి సలహా చెప్పు.
బావ : నాకు అర్జంటుగా లక్ష రూపాయలు అప్పు ఇప్పించు. వెంటనే చెప్తా బామర్ది.

చీకటైతే...

లెక్చరర్ : మనం ఉంటున్న ప్రపంచం మొత్తం కొన్నేళ్ల పాటు చీకటిగా వుంటే ఏమౌతుంది?
స్టూడెంట్ : టార్చిలైట్లు, కొవ్వొత్తులు అమ్మేవాళ్లకు ఎంతో బావుంటుంది సర్.

- జె.సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

ఓం శాంతి!

టీచర్ : స్కూల్ ప్రశాంతంగా ఉండాలంటే ఏం చెయ్యాలి?
చంటి : సెలవులివ్వాలి.

- డి. సాయి ప్రసాద్, గాజువాక.

మతిమరుపు

రావు: ఒరే సుబ్బీ...ఏంట్రా వంటినిండా ఇన్ని కట్లు?
సుబ్బారావు: ఏం చేద్దాంరా! మొన్న ఒకానొక టెన్షన్‌లో వందవ అంతస్తు నుంచి కిందికి దూకాల్సి వచ్చింది.
రావు: ఏంటా టెన్షన్?
సుబ్బారావు: మొన్న ఒక మిత్రుడు నా దగ్గరకొచ్చి...'మీ అమ్మాయి కింద స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయిందట్రా అప్పారావ్' అన్నాడు. అంతే . ఆ టెన్షన్లో...వెనకా ముందూ ఆలోచించకుండా వందవ అంతస్తు నుంచి కిందకి దూకేశాను. కానీ...50వ అంతస్తు దాటుతున్నప్పుడు గానీ...నాకు అసలు కూతురే లేదని, 25వ అంతస్తు దాటేటప్పుడు నాకు అసలు పెళ్లే కాలేదని, 10వ అంతస్తు దాటేటప్పుడు గానీ నేను అసలు అప్పారావుని కాను... సుబ్బారావునని గుర్తొచ్చింది.

కనిపించట్లేదే!

డాక్టర్: (ఫోన్‌లో) హలో...శ్యామ్! మిమ్మల్ని చూసి చాలా రోజులైందే!
శ్యామ్: అవునండీ. నాకు ఈ మధ్య ఆరోగ్యం బావుండడంలేదు.

కనిపించట్లేదే!

రోగి: డాక్టర్! నేను ఈ ఆపరేషన్ తర్వాత వయొలిన్ వాయించగల్గుతానా?
వైద్యుడు: ఆ...తప్పకుండా.
రోగి: ఏంటి వయొలిన్ నేర్చుకోకపోయినానా?

బెర్తు

భర్త: అబ్బ..రాత్రి రైల్లో అస్సలు నిద్ర పట్టలేదు.
భార్య: ఏ ఎందుకంట!
భర్త: అప్పర్ బెర్త్ వచ్చి చచ్చిందిలే.
భార్య: పోనీ లోయర్ బెర్త్ వారితో మాట్లాడి కిందికి మార్చుకుంటే పోయేదికదా.
భర్త: కింద ఎవరూ లేరే!

లైట్ భోజనం

సుబ్బారావ్: ఏంట్రా అప్పారావ్ ఇలా వీధి లైటు కింద కూర్చుని అదేపనిగా పైకి చూస్తున్నావ్?
అప్పారావ్: భోజనం చేస్తున్నారా!
సుబ్బారావ్: ఏంటీ...తమాషానా! నోరు తెరుచుకుని పైకి చూస్తూ భోజనం చేస్తున్నానంటావా?
అప్పారావ్: అరే పిచ్చి మొద్దూ! డాక్టర్ ఇక నుంచి రాత్రి పూట లైట్ భోజనమే తీసుకోమన్నారు. అందుకనే ఈ ఏర్పాటు.

సెలూన్

రాజు: ఏంట్రా! మొన్నేదో వ్యాపారం పెట్టావంటగా. ఎలా వుంది?
రాంబాబు: అవున్రా! రెండు లక్షల పెట్టుబడి పెట్టా. అంతా క్షవరం చేసినట్టయింది.
రాజు: ఇంతకీ ఏం బిజినెస్ చేశావ్? ఎక్కడ చేశావ్?
రాంబాబు: పంజాబ్‌లో సెలూన్ పెట్టాన్రా.

వచ్చే ఏడాది

మణి: నేను నీకంటే ఏడాది పెద్దదాన్ని. నన్నెలా పెళ్లాడతావ్?
మహేష్: మరేం పర్లేదు.మనిద్దరం వచ్చే సంవత్సరం పెళ్లి చేసుకుందాం.

- కె.పద్మ, లక్ష్మీనగర్, మెదక్.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

పాట రాయడం కన్నా...
రాసింది ఓకే అనిపించుకోవడమే కష్టం...!

పాటల రచయిత **భాస్కరభట్ల రవికుమార్** చెప్పిన పలు ఆసక్తికర అంశాలను గతవారం తెలుసుకున్నాం. సినీ పరిశ్రమకు, ప్రేక్షకులకు, తనకు వారధిలా వున్న పాటల గురించి ఆయన ఈవారం మరిన్ని విశేషాలు తెలిపారు. అసలు పాట రాయడం కన్నా...రాసింది ఓకే అనిపించుకోవడమే కష్టమని ఆయన ఎందుకన్నారో ఏంటో తెలుసుకుందాం.

ఎంతసేపటికీ పామరజనం చప్పట్లు కొట్టే మాటలే ఉపయోగిస్తారా? మంచి భావ వ్యక్తీకరణలు చేయవద్దా?

అలాంటి భావ వ్యక్తీకరణలు నా పాటల్లో ఎందుకు లేవు! ఉన్నాయి. 'తులసి' చిత్రంలోని 'నీ కళ్ళతోటి నా కళ్ళలోకి...', 'బొమ్మరిల్లు'లోని 'బొమ్మను గీస్తే నీలా ఉంది...', 'గోలీమార్'లోని 'గుండెల్లో ఏదో సడి...', 'నచ్చావులే'లోని 'నిన్నే నిన్నే కోరా...', 'పెదబాబు'లోని 'నవ్వవయ్య బాబూ...' – ఇలా నేను రాసిన పాటల్లో మంచి భావ వ్యక్తీకరణలు కనిపిస్తాయి. అలాగే, 'రాజు – మహరాజు' చిత్రంలోని 'మమతల కోవెలలోన...' అనే పాటలో మానవ సంబంధాల కన్నా, డబ్బు ఎక్కువ కాదని చెబుతూ, ఒక్క ఇంగ్లీషు మాటైనా లేకుండా మనసుకు తగిలే పాట రాశాను. అయితే, అన్నీ ఇలా క్లాస్ పాటలూ రాయలేం. అలా మాస్ పాటలూ రాయలేం. వచ్చిన అవకాశాన్ని బట్టి రాయాల్సి ఉంటుంది. అయితే, ఒకటి మాత్రం నిజం. సినిమా రంగానికి వచ్చాక, దర్శక, నిర్మాతలు చెప్పిన సినీ అవసరాలను బట్టి ఏదైనా రాయాల్సి ఉంటుంది. ఫలానావే రాస్తానని మడి కట్టుకొని కూర్చోలేం.

మరి, మీ పాటలు, ప్రయోగాలు ఏ మేరకు జనాదరణ పొందుతున్నాయంటారు?

నా పాటలకు వస్తున్న జనాదరణే దానికి సాక్ష్యం. అంతెందుకు! ఆ మధ్య నాగార్జున 'సూపర్' చిత్రంలో 'మిల మిల మెరిసేవెందుకో కనులెందుకో...' అనే పాట ఎంతటి ప్రాచుర్యం సంపాదించిందంటే, 'ఎం' టి.వి, చానల్ 'వి', 'జూమ్' లాంటి చానళ్ళలో పదే పదే ప్రసారమైన తొలి దక్షిణ భారతీయ చలనచిత్ర గీతమది. చివరకు టాటా యంగ్ అనే ఓ థాయ్ గాయని దానితో ఓ అంతర్జాతీయ ఆల్బమే చేసింది.

అయితే, మీ పాటలన్నీ జనం మెచ్చినవే! మీకు నచ్చినవే! మీకు నచ్చనివి ఏమీ లేవంటారు?

(నవ్వుతూ...) అలా అనడం లేదు. ఒకటీ, అరా కాదు, నాకు నచ్చని పాటలు కూడా బియ్యంలో రాళ్ళ లాగా చాలా ఉన్నాయి, ఉంటాయి. నేను రాసిన పాటల్లో సగం నచ్చినవైతే, మరో సగం నాకు కూడా నచ్చనివే! అవకాశాల కోసం వెతుక్కుంటున్న సమయంలో వచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోలేం కదా! ఆ ప్రయత్నంలో మరీ సాదాసీదా పాటలు కొన్ని వస్తాయి. కథ, సందర్భం వదిలేసి, దర్శకులు, హీరోల అభిరుచికి మాత్రమే అనుగుణంగా పాటలు రాసినప్పుడు సగటు రకం పాటలే వస్తాయి. ఓ స్థాయికి చేరుకొనే వరకూ, అది ప్రతి రచయితకూ అది తప్పనిసరి ఇబ్బంది. అయితే, అలా తప్పనిసరి పరిస్థితుల్లో రాసిన తలనొప్పి పాటల్ని ప్రేక్షకులే కాదు, నేనూ అంతే త్వరగా మర్చిపోతాను.

ఇంతకీ ఇవాళ పాట రాయడం ఎంత కష్టమంటారు?

(గంభీరంగా మారి...) ఇవాళ పాట రాయడంలో కష్టం ఏమీ లేదు. కానీ, రాసిన పాటకు పచ్చజెండా ఊపించుకోవడమే అసలు కష్టంగా మారింది. కొంత కాలం నిర్మాతలు, మరికొంత కాలం దర్శకులు, ఇంకొంత కాలం సంగీత దర్శకులు, ఇప్పుడేమో సోకాల్డ్ పెద్ద హీరోలు పాటను శాసిస్తున్నారు. ఏ పాట ఎలా కావాలో వాళ్ళు నిర్ణయిస్తున్నారు. ఇవాళ పాట అలా చేతులు మారుతోంది. చివరకు పాట ఏ రూపంలో, ఎలా సినిమాలో బయటకు వస్తుందనేది తిరుమలలో వెంకటేశ్వర స్వామి దర్శనం ఎలా అవుతుందన్నంత కష్టంగా తయారైంది. కానీ, పూరీ జగన్నాథ్, రవిబాబు లాంటి కొందరు దర్శకులు మాత్రం ఇవాళ్టికీ తమ చిత్రాల్లోని పాటలకు తామే నిర్దేశకులు. వాళ్ళ ప్రోద్బలం, ప్రోత్సాహం వల్లే నేను ధైర్యంగా అనుకున్నది రాయగలుగుతున్నా.

ఏ పాట అయినా హిట్టవడంలో సంగీతం పాలెంత? సాహిత్యం పాలెంత?

ఏ పాట అయినా సరే జనాదరణ పొందాలంటే, సంగీతానిది సగం పాత్ర. సాహిత్యానిది మిగతా సగం పాత్ర. ఎంత మంచి పాట అయినా, బాణీ బాగా లేకపోతే జనంలోకి వెళ్లదు. బాణీ కూడా బాగుంటే మటుకు, మంచి పాట మరింత ఉన్నత స్థాయికి చేరుతుంది.

ఒక దర్శకుడు, ఒక సంగీత దర్శకుడు, ఒక గీత రచయిత - ఇలా ఒకే కలయిక పదే పదే పలు చిత్రాల్లో రావడం లాభమంటారా? నష్టమంటారా?

లాభమే! ఒకే కాంబినేషన్ పదే పదే కుదురుతున్నప్పుడు చాలా సానుకూల అంశాలున్నాయి. ఆత్రేయ - కె.వి. మహదేవన్, ఆరుద్ర - పెండ్యాల ... ఇలా ఒకే కలయికలో ఎన్ని చిత్రాల్లో, ఎన్ని పాటలు రాలేదు! అడ్వాంటేజ్ ఉంది కాబట్టే, జట్టు కొనసాగుతుంది. ఒకవేళ లాభం లేదంటే ఆ కలయిక క్షణాల్లో విడిపోతుంది.

దర్శకుడు పూరీ జగన్నాథ్‌తో మీరు పదే పదే సినిమాలు ఎలా చేయగలుగుతున్నారు?

ఆయనతో కలసి 10 - 15 సినిమాలు చేశాను కాబట్టి, ఆయన పద్ధతేమిటో నాకూ, నా పద్ధతేమిటో ఆయనకూ తెలుసు. అలాగే, ఆయన విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతం నుంచి వచ్చినవాడు కాబట్టి, అక్కడి మాట తీరు, మాండలికంతో కూడిన పదాలు వాడితే ఆయనకు నచ్చుతుంది. అలాగే, పాటల్లో కొంచెం దూకుడుతనం, ఆత్మవిశ్వాసం ప్రతిబింబింపజేయాలని ఆయన అనుకుంటారు. అలా ఆ దర్శకుడి అభిరుచి తెలుసు కాబట్టి, ఆయన చిత్రంలో ఏ సందర్భానికి, ఎలాంటి పాట రాయాలో అలవాటు మీద నాకు తెలుస్తుంది. అటు ఆయనకూ, ఇటు నాకూ పెద్దగా ఇబ్బంది లేకుండానే అలవోకగా పాట పూర్తయిపోతుంది.

అంటే, ఇలా పదే పదే ఒకరితోనే కలసి పనిచేయడం వల్ల అసలు ఇబ్బందులే లేవని మీ వాదన?

ఓ చిన్న ఇబ్బంది మాత్రం ఉంది. తరచూ ఒకే దర్శక, సంగీత దర్శకులతో పని చేయడం వల్ల ఇతర దర్శక, సంగీత దర్శకుల బృందానికి దూరమయ్యే అవకాశం ఉంటుంది. 'భాస్కరభట్ల ఫలానా పూరీ జగన్నాథ్‌కే రాస్తాడు. ఫలానా చక్రికే రాస్తాడు. ఇతను వాళ్ళ మనిషి' లాంటి అపోహలు వస్తాయి. అలవాటైపోయిన ఆ టీమ్‌లో నుంచి బయటకు వచ్చి, వేరే టీమ్‌లో రాయడం కొంత కష్టమే. కానీ, రచయితగా పది కాలాల పాటు ఇక్కడ నిలబడాలంటే, అలా ఒకే టీమ్‌కు పరిమితం కాకుండా, బయటకొచ్చి, వేరే టీమ్‌లతోనూ పనిచేస్తూ, విజయాలు సాధించాలి. అలా చేస్తేనే మనుగడ!

మీరు ఆ మధ్య ఓ సినిమాకు మాటలు కూడా రాసినట్లున్నారే!

అవును. సూర్యకిరణ్ దర్శకత్వంలో జగపతిబాబు నటించిన 'బ్రహ్మాస్త్రం' చిత్రానికి! అది ఓ పీడకల. నేను మర్చిపోయా. మీరూ మర్చిపోండి!



పూరీ జగన్నాథ్‌తో భాస్కరభట్ల

ఇవాళ పాట రాయడంలో కష్టం ఏమీ లేదు. కానీ, రాసిన పాటకు పచ్చజెండా ఊపించుకోవడమే అసలు కష్టంగా మారింది. కొంత కాలం నిర్మాతలు, మరికొంత కాలం దర్శకులు, ఇంకొంత కాలం సంగీత దర్శకులు, ఇప్పుడేమో సోకాల్డ్ పెద్ద హీరోలు పాటను శాసిస్తున్నారు. ఏ పాట ఎలా కావాలో వాళ్ళు నిర్ణయిస్తున్నారు. ఇవాళ పాట అలా చేతులు మారుతోంది. చివరకు పాట ఏ రూపంలో, ఎలా సినిమాలో బయటకు వస్తుందనేది తిరుమలలో వెంకటేశ్వర స్వామి దర్శనం ఎలా అవుతుందన్నంత కష్టంగా తయారైంది. కానీ, పూరీ జగన్నాథ్, రవిబాబు లాంటి కొందరు దర్శకులు మాత్రం ఇవాళ్టికీ తమ చిత్రాల్లోని పాటలకు తామే నిర్దేశకులు. వాళ్ళ ప్రోద్బలం, ప్రోత్సాహం వల్లే నేను ధైర్యంగా అనుకున్నది రాయగలుగుతున్నా.

గీత రచయితగా పదేళ్ళు నిండిన మీ ప్రస్థానంతో తెలుగు సినిమాలో మీకెలాంటి స్థానం లభించిందని అనుకుంటున్నారు?

తెలుగు సినిమాలో నా స్థానం గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. అయితే, మంచి గానో, చెడు గానో నా గురించి అందరికీ తెలిస్తే చాలనుకున్నా. ఆ గుర్తింపు వచ్చిందనే భావిస్తున్నా. నిజం చెప్పాలంటే, వెండితెర మీద ఒక్కసారి నా పేరు చూసుకొని వెళ్ళిపోదామనే చిన్న లక్ష్యంతో ఇక్కడకు వచ్చాను. అనుకున్నది చేసేశాను. ఆ లక్ష్యం నెరవేరింది. ఇప్పటిదంతా బోనస్సే! క్రమంగా పాటల రచనకు ఓ నిర్ణీత సమయమే కేటాయించి, విడిగా కవితల రచన లాంటివి చేయాలని ప్రయత్నిస్తున్నా. కేవలం సినీ గీత రచయితగానే కాక, కవిగా నేను ప్రత్యేకంగా గుర్తింపు పొందాలనుకుంటున్నా.

అసలు ఈ స్థితిని మీరు ఎప్పుడైనా ఊహించారా?

చూడండి. బస్సెక్కాలంటే బస్ స్టాండ్‌లో, రైలెక్కాలంటే రైల్వే స్టేషన్‌లో ఉండాలి. మొదట్లో సినీ గీత రచయితను కావాలనుకున్నా. ఇక్కడకు వచ్చా. ఇక్కడే ఉంటున్నా. నాకు రాయడం తప్ప మరో విద్య తెలియదు. అక్షరాలే నాకు కూడు పెట్టాలనుకున్నా. రాజమండ్రిలో 'ఈనాడు' దినపత్రికకు కంట్రిబ్యూటర్‌గా వచ్చిన తొలి సంపాదన 126 రూపాయలు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నేను అక్షరాల మీదే బతుకుతున్నా.

ఇప్పటి పాటల కన్నా ఒకప్పటి పాటలే బాగున్నాయనే వర్గానికి మీరిచ్చే సమాధానం?

వట్టి రచ్చబండ పంచాయతీలు, ఇప్పటి పాటల కన్నా అప్పటివే బాగున్నాయి అంటే కుదరదు. కాలంతో పాటు మారనివాళ్ళు అనే మాటలు అవి. నన్నడిగితే - ఆనాటి దిబ్బరొట్టె ఎక్కువా కాదు, ఇవాళ్టి పిజ్జాలు, బర్గర్లూ తక్కువా కాదు. దేని రుచి దానిదే! ఒడ్డున కూర్చొని ప్రశ్నలు అడిగేవారెవరికీ నేను జవాబు చెప్పను. టీవీలో క్రికెట్ మ్యాచ్ చూస్తూ, ఆ బంతిని సచిన్ సిక్స్ కొట్టాల్సింది అని చెప్పడం తేలిక. మైదానంలోకి దిగి మ్యాచ్ ఆడేవాడికీ, ఇక్కడకొచ్చి పాట రాసేవాడికీ కష్టమేంటో తెలుస్తుంది.

పాట రాయడం కష్టమంటున్నారు. కానీ, పాటల రచయితల సంఖ్య పెరిగిందేం?

సంఖ్యాపరంగా ఇవాళ ఎక్కువమంది గీత రచయితలు కనిపిస్తుండవచ్చు. కానీ, ఇవాళ ఒక పాట రాసి, రకరకాల చేతులు మారి, ఆఖరికి ఓ.కె. అనిపించుకోవడం ఎంత నరకంగా మారిందో ఇక్కడున్నవాళ్ళకు తెలుసు. చిత్ర పరిశ్రమలో గీత రచయితగా స్థిరపడాలంటే - కొత్తగా ఆలోచించడం, ఎప్పటికప్పుడు తనను తాను నవీకరించుకోవడం, భాషాజ్ఞానం పెంపొందించుకోవడం చాలా అవసరం. అలాంటి వాళ్ళకు సినిమా రంగంలో ఆహ్వానం, అవకాశం, స్థానం ఎప్పుడూ ఉంటాయి. ఇవాళ వేగం పెరిగింది. ప్రతిభావంతులైన కొత్త రచయితల ప్రవేశమూ పెరిగింది. అందుకే, సినీ గీత రచన ఇవాళ పెను సవాలుగా మారింది.

- రెంటాల జూనియర్

మినపప్పు వడియాలు

కావలసిన పదార్థాలు

మినపప్పు - అరకిలో, పచ్చిమిర్చి - 6, జీలకర్ర - 3 టేబుల్ స్పూన్లు ఉప్పు - సరిపడా, అల్లం - అరంగుళం ముక్క

తయారు చేసే పద్ధతి

మినపప్పును నాలుగు గంటలు నానబెట్టాలి. వీటిని జీలకర్ర, అల్లం, పచ్చిమిర్చి, ఉప్పు వేసి నీళ్ల పొయ్యకుండా మెత్తగా రుబ్బుకోవాలి. పల్చటి తడిబట్ట లేదా పాలిథిన్ కవర్ మీద రుబ్బిన పిండిని చిన్న గోలీల సైజులో పెట్టుకుని ఎండబెట్టాలి. వీటిని రెండు మూడు రోజులు ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత డబ్బాలో పోసుకుంటే చాలా రోజులు నిల్వ ఉంటాయి. వీటిని ఎప్పుడు కావాలంటే అప్పుడు నూనెలో వేయించుకోవచ్చు.



రైస్ టమాటా వడియాలు

కావలసిన పదార్థాలు

అన్నం - అరకిలో, టమాటా - పావుకిలో, జీలకర్ర - 100 గ్రా నువ్వులు - 50 గ్రా, పచ్చిమిర్చి - పావుకిలో, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

టమాటా ముక్కలు, పచ్చిమిర్చి మెత్తగా నూరుకోవాలి. అన్నం వండేటప్పుడు జీలకర్ర, ఉప్పు వేయాలి. అందులోనే టమాటా, పచ్చిమిర్చి పేస్ట్ వేసి కొంచెం మెత్తగా వండుకోవాలి. కొంచెం ఆరాక ఈ అన్నాన్ని మెత్తగా ఎనిపి చిన్న చిన్న బిళ్లలుగా చేత్తో వత్తుకుని ఎండబెట్టాలి. వీటిని కూడా రెండు మూడు రోజులు ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత నూనెలో వేయించుకుంటే బావుంటాయి.



రవ్వ వడియాలు

కావలసిన పదార్థాలు

బొంబాయి రవ్వ - అరకిలో
ఉప్పు - తగినంత, అల్లం - అరంగుళం ముక్క
పచ్చిమిర్చి - 6, జీలకర్ర - 3 టేబుల్ స్పూన్లు

తయారు చేయు పద్ధతి

రెండు లీటర్ల నీళ్లను గిన్నెలో పోసి మరగబెట్టాలి. ఉప్పు, అల్లం, పచ్చిమిర్చి నూరుకొని మరిగే నీళ్లలో వేయాలి. తర్వాత రవ్వ వేసి కలియదిప్పుతుంటే ముద్ద అవుతుంది. ఇలా వచ్చిన తర్వాత స్టౌమీద నుండి దింపుకోవాలి. ఇది కొద్దిగా ఆరిన తర్వాత చక్రాల గిద్దెల్లో పెట్టి చిన్న చిన్న చక్రాలుగా వత్తుకుని ఎండలో పెట్టుకోవాలి. ఇలా రెండు మూడు రోజులు ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వీటిని వేయించుకుంటే చాలా రుచిగా వుంటాయి.





మజ్జిగ మిరపకాయలు

కావలసిన పదార్థాలు

పచ్చిమిరపకాయలు - అరకిలో
పెరుగు - పావులీటరు, జీలకర్ర - 5 స్పూన్లు, ఉప్పు - తగినంత

తయారు చేసే పద్ధతి

పెరుగును చిలికి మజ్జిగ చెయ్యాలి. నూరిన జీలకర్ర, ఉప్పును అందులో కలపాలి. మిరపకాయలను కడిగి తొడిమ విడిపోకుండా నిలువుగా గాటు పెట్టుకోవాలి. వీటిని మజ్జిగలో నానబెట్టాలి. ఒక రోజు నానిన తర్వాత ఎండలో ఆరబెట్టాలి. మళ్లీ సాయంత్రం అదే మజ్జిగలో వేసి మరుసటి రోజు ఉదయం తిరిగి ఎండబెట్టాలి. ఇలా మజ్జిగంతా అయిపోయేవరకు రోజూ వేసి తీస్తుండాలి. మిరపకాయలు బాగా ఎండిన తర్వాత గాలి చొరబడని డబ్బాలో వేసుకోవాలి. వీటిని ఎప్పుడు కావాలంటే అప్పుడు నూనెలో వేయించుకోవచ్చు.



సగ్గుబియ్యం వడియాలు

కావలసిన పదార్థాలు

సగ్గుబియ్యం - అరకిలో, పచ్చిమిర్చి - 6, జీలకర్ర - 3 టేబుల్ స్పూన్లు అల్లం - అరంగుళం ముక్క, ఉప్పు - సరిపడినంత

తయారు చేసే పద్ధతి

సగ్గుబియ్యం నానబెట్టాలి. అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు మెత్తగా నూరుకోవాలి. ఐదు లీటర్ల నీటి మరగబెట్టి, అందులో నూరిన అల్లం, పచ్చిమిర్చి ముద్ద వేయాలి. తర్వాత నానబెట్టిన సగ్గుబియ్యాన్ని అందులో వేసి ఉడకనివ్వాలి. కొద్దిగా ఆరిన తర్వాత ఎండలో పెట్టిన పాలిథిన్ కవర్ లేదా తడిబట్ట మీద స్పూన్‌తో కొంచెం కొంచెం వేయాలి. ఇవి బాగా ఎండాక డబ్బాలో పోసుకోవచ్చు. వీటిని మరో రెండు మూడు రోజులు ఎండబెట్టుకుంటే చాలా కాలం నిల్వ ఉంటాయి. కావలసినప్పుడు నూనెలో వేయించుకుంటే సరి. కరకరలాడుతూ చాలా బాగుంటాయి.

'మానసిక శాస్త్రం' అత్యవసరం



పిల్లల్ని పెంచే క్రమంలో శరీర ధర్మశాస్త్రం, నిర్మాణ శాస్త్రం, ప్రాథమిక విజ్ఞానం తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఎంతో అవసరం. అలాగే పిల్లల్లో మానసిక అభివృద్ధిని పెంపొందించడం ఎలాగో కూడా నేర్చుకోవాలి. అందుకు 'మానసిక శాస్త్రం' అత్యవసరం. 'గన్‌రెడ్డి రాజారెడ్డి, జిల్లెళ్ళ వేణుగోపాల్ రెడ్డి' మేధోమధనంతో వెలువడిన 'మానసిక శాస్త్రంలో ప్రాథమిక అంశాలు' ఆ శాస్త్రం గురించి తెలియచేస్తుంది. దీన్ని అధ్యయనం చేయడం ప్రభావాత్మకంగా ఉంటుంది. విద్యార్థుల మధ్య ఉండే వ్యక్తిగత భేదాలు, వారి సామర్థ్యాలు, అభిరుచులు, వ్యక్తిత్వాలు మొదలైన విషయాల్లో శాస్త్రీయ అవగాహన కలిగిస్తుంది ఈ పుస్తకం. ప్రపంచీకరణ నేపథ్యంలో రకరకాల ప్రభావాలు మనపై పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానంగా పిల్లల జీవితాలకు పునాదులు వేసే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారి మానసిక విజ్ఞానాన్ని వికసింపజేయడానికి ఈ రచన ఉపయోగపడుతుంది. మానసిక శాస్త్ర విజ్ఞానాన్ని అందించే పుస్తకం తెలుగులో రావడం ఆహ్వానించదగిన పరిణామం. సో కాల్డ్ రచయితలు డబ్బు కోసమో, పేరు ప్రతిష్టల కోసమో రచనలు చేస్తుంటారు. కానీ సమాజం మరియు మానసిక వికాసం కోసం శాస్త్రీయ దృక్పథంతో రచించేందుకు సాహసోపేత నిర్ణయం తీసుకున్న రచయితలకు జేజేలు. ఇందులో ప్రాథమికాంశాలను చాలా క్లుప్తంగా, స్పష్టంగా అందరికీ అర్థమయ్యేలా రచించారు. 'జ్ఞాపకశక్తి'కి సంబంధించి నేటి విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటిని అధిగమించడానికి సముచితమైన సూచనలను దీనిలో చేశారు. అలాగే విజయాన్ని సాధించడానికి మన నిత్యజీవితంలో ఎటువంటి అలవాట్లు చేసుకోవాలో కూడా ఇందులో పొందుపరిచారు. 'మానసికాభివృద్ధి పరిసరాలతో అనుసంధానమై జరుగుతుంది. పరిసరాల్లో సంస్కృతిలో వచ్చే మార్పులే మానసికాభివృద్ధిపై ప్రభావం చూపుతాయి. నేడు ఇవి క్లిష్టతరమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పిల్లల పెంపకం, విద్య కూడా మరింత సంక్లిష్టమవుతున్నాయి' అన్న రచయితల మాటలు అక్షరసత్యాలు. "పిల్లల ప్రవర్తనను అంచనా వేయడం, అర్థంచేసుకోవడం, మార్గదర్శనం చేయడం మానసిక ఆధారిత శాస్త్రీయ ప్రక్రియలే. అందుకే బోధనా వృత్తిని ఎంచుకొన్న వారెవరైనా 'మానసిక శాస్త్రం' చదవాల్సిందే" అని డా॥ఎస్.భాస్కరనాయుడు అంటే.. 'ఈ పుస్తకం విద్యార్థులను ఉత్తమ భావి సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దుతుందన్న' దృఢ అభిప్రాయాన్ని ప్రొ॥కె.నిరంజన్‌రెడ్డి వ్యక్తపరిచారు. వీరిద్దరూ ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో రాసినవన్నీ వాస్తవానికి అద్దం పట్టినట్లున్నాయంటే అతిశయోక్తి కాదు.

మానసిక శాస్త్రంలో ప్రాథమిక అంశాలు, రచన : గన్‌రెడ్డి రాజారెడ్డి, జిల్లెళ్ల వేణుగోపాల్ రెడ్డి, వెల : 155/-, పేజీలు : 134, ప్రతులకు: హ్యూమన్ బిహేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, సర్వే నెం. 26, సిపిఆర్ఐ ఎదురుగా, వరంగల్ హైవే, మేడిపల్లి, ఘట్ కేసర్ మండలం, రంగారెడ్డి జిల్లా. ఫోన్ : 04027207678, 04065300057.

- శాంతిశ్రీ

కొత్త పుస్తకాలు

వెతలే కతలైతే...

కొన్ని కథలు సమాజాన్ని పైపైనే స్పృశిస్తే... మరికొన్ని సమాజపు లోతులు తరచిచూసి, వాస్తవాలను కళ్లకు కడతాయి. వీటిల్లో మొదటిరకం కొన్నాళ్లకే మరుగునపడిపోతే, రెండోరకం తరాలు గడిచినా మెదడుపొరల్లో దోబూచులాడతాయి. మనసును అంతర్లీనంగా జాగృతపరుస్తాయి. అలాంటి రెండో కోవకు చెందినవే "సిఎస్ రావు కథలు". నిజానికివి కథలు కావేమో! పేదవాని కష్టాలు, కన్నీళ్లు, ఆకలి, ఆక్రోశం... వీటన్నింటికీ కారకులెవరో, తమలో రగిలే ఆగ్రహావేశాలను ఎవరిపై చూపాలో అర్థంకాని బడుగుజీవుల వెతలకు రచయిత ఇచ్చిన అక్షరరూపాలు. ప్రజలకోసం పాలన అంటూ చెప్పుకునే పాలనాయంత్రాంగం నిజానికి ఉండేది ఎవరికోసమో మరో మాట లేకుండా తేల్చి చెప్పే కథ 'కొరడా'. అదే సందర్భంలో ఏనాటికైనా తిరుగుబాటు తప్పదనీ, గెలుపు ప్రజలదేననీ ఉద్బోధిస్తుంది కూడా! పేదవాని కన్ను ఎరుపెక్కితే ఫలితమేంటో 'ఊరుమ్మడి బతుకులు' నిరూపిస్తుంది. 'మార్పుకు మార్గం' పేదరికంలో కులం, హోదా అనుక్షణం గుర్తుచేస్తూ హింసించే పెత్తందారులు ఆ పేదవానికే ఆర్థికస్థోమత రాగానే ఎలా మారిపోతారో చెప్పే కథ. 'గంజాయిగొట్టాలు' పడుపువృత్తి అగచాట్లకు ప్రతీక. 'మల్లెమొగ్గ' హృదయానికి హత్తుకుపోతుంది. 'తెగిన సాలెగూడు'లో చక్రవడ్డీలతో గ్రామస్థులను పీడించే భూషణానికి సత్తెయ్య బుద్ధిచెప్పిన తీరు శభాషనిపిస్తుంది. బ్రిడ్జి, ప్రాజెక్టుల నిర్మాణాల్లో సమిధలైపోయే కార్మికుల కడగండ్లు 'రాళ్లెత్తిన వాళ్లు' శ్రీశ్రీగారి 'తాజ్‌మహల్ నిర్మాణానికి...' గుర్తుచేస్తుంది. పేదవాని శ్రమను దోచుకోవడం, వారి బతుకులతో ఆడుకోవడం పెద్దలకు ఎంత సరదానో 'బంగారమ్మ కమతం' చెబుతుంది. 'కొండమీద పెళ్లి' మనసును మెలిపెట్టే కథ. ఊరంతటికీ వెలయాలైనా తమ్మునికోసం అమ్మగా మారిన మగువ గాథ 'పారిజాతం'. అన్నెంపున్నెం యెరుగని అమాయకులు కలిసికట్టుగా తిరగబడితే ఎంతటివారైనా తోక ముడవాల్సిందే అంటుంది 'లాంగ్ బెల్'. డాంబికాలు పోయే పెద్దింటోళ్ల మనస్తత్వాలకు చెంపపెట్టు 'గుమ్మడి గింజలు' కథ. ఇలా చెప్పుకుంటూపోతే 'మంత్రసాని', 'అర్పణ', 'ముసలెద్దు', 'మంచి కళ్లజోళ్లు కొనుక్కోండి', 'పేవ్‌మెంట్', 'రాజనీతి', 'తీయని ఆకలి', 'ప్రశ్న'... ఇలా ఎన్నో! ఈ కథలు ఓసారి చదవండి. పోయేదేమీ లేదు... చుట్టూ సమాజంపట్ల ఓ ఆలోచన, అవగాహన ఉదయించడం తప్ప!



సి. యస్. రావు కథలు ,పేజీలు: 224, వెల: 120/-, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

- కె.అరుణ

వేద వాఙ్మయము
మువ్వల సుబ్బరామయ్య
వెల : 75/-, పేజీలు :175
ప్రతులకు :
మువ్వల పెరుమాళ్లు & సన్స్,
29-13-19/బి,
చరితశ్రీ హాస్పటల్ ఎదురు లైను,
మల్లికాంబ వీధి, సూర్యారావు పేట,
విజయవాడ.



దివాకర్ల సాహితీ వంశ వైభవం
చోడవరపు బంగార్రావు
పేజీలు :48
ధర : అమూల్యం
ప్రతులకు :
చోడవరపు బంగార్రావు, జర్నలిస్ట్
ఉండి - 534199
సెల్ : 929680117,
9347504477.



చూద్దామా


ఫీల్డ్ మ్యూజియంలో ఓ భాగం...

ఒంటరి విహార యాత్ర

- రావెల సాంబశివరావు

చికాగోలో మరో బసవపున్నమ్మగారు ఉన్నారు. నా భార్య (బసవపున్నమ్మ) తోపాటు మరో బసవపున్నమ్మ గారు కూడా గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో రసాయనశాస్త్రం లెక్చరర్‌గా పనిచేశారు. కాలేజీలో ఆమెను పెద్ద బస్సుగా, నా భార్యను చిన్న బస్సుగా పిలుచుకునేవారు. పెద్ద బసవపున్నమ్మ గారి భర్త పేరూ సాంబశివరావు కావడం చిత్రంగా కన్పించినా అది వాస్తవం. చికాగోలో మేం బస చేసే హోటల్‌కి ఆమె వాళ్లమ్మాయితో వచ్చింది. వాళ్లు ఆ రోజు రాత్రి మమ్మల్ని భోజనానికి ఒక భారతీయ హోటల్‌కి తీసుకెళ్లారు.

అసలు ఆరోజు (10-7-2010) మేం పియోరియా నుండి చికాగోకు ఉదయం పదకొండు గంటలకే చేరుకున్నాం. ముందు మేం ఫీల్డ్ మ్యూజియం చూశాం. అది చాలా వెడల్పుగా ఉంది. మెట్ల వెనుక ఎత్తుగా, హుందాగా గ్రీకు తరహా భవన నిర్మాణ శిల్పం బాగా ఆకట్టుకుంది. లోపలికి వెళ్లగానే పెద్ద ఏనుగుల జంట కనిపిస్తుంది. ఆ పక్కనే 'సూ' అనే పురాతన జంతువు అస్థిపంజరం. ఈ ప్రదర్శనశాలను 1893లో చిన్నదిగా స్థాపించారట. అయితే ఇప్పుడున్నది మాత్రం 1921లో రీమోడలింగ్ చేసినది. ఇది జీవ శాస్త్రానికి పురావస్తు శాస్త్రానికి, మానవ పరిణామ చరిత్రకు, శాస్త్ర విజ్ఞానానికి ఎంతో దోహదపడుతుంది. అంతేకాదు, అందులో ఈజిప్టు మమ్మీలను కూడా మనం తిలకించవచ్చు. మానవ జీవ పరిణామానికి సంబంధించి అత్యాధునిక సమాచారాన్ని కూడా ఇక్కడ పొందవచ్చు. రెండు మూడు అంతస్తుల్లో ఉన్న ఆ మ్యూజియాన్ని ఒక గంటసేపు గైడ్ తిప్పి చూపించాడు. తర్వాత మేమొక గంటసేపు తిరిగాం. అది కనీసం ఒకటి రెండు రోజులు నిదానంగా తిరిగి చూడవలసిన ప్రదేశం. ఎందుకంటే ఆ ప్రదర్శనశాలలో దాదాపు రెండు కోట్ల రకాల జీవులున్నాయి.

మ్యూజియం పక్కనే షెడ్ అక్వేరియం ఉంది. ఇంట్లో ఉండే అక్వేరియంలో నాలుగైదు రంగుల చేపపిల్లల్ని చూసి మనం మురిసిపోతుంటాం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ అక్వేరియంలోనైతే 1500 రకాలకు చెందిన 22వేల జలచరాలను చూడొచ్చు. సంవత్సరంలో రమారమి రెండులక్షల మంది వరకు ఈ అక్వేరియాన్ని సందర్శిస్తారు. పెద్ద పెద్ద తిమింగలాల నుండి చిట్టి చేపల వరకు ఇందులో చూడొచ్చు. అంతేగాక పెంగ్విన్, శ్వాన్స్ (హంసలు) కూడా కన్పిస్తాయి. అయితే ఆ హంసలు పాలను, నీటిని విడగొట్టడం మాత్రం నేను చూడలేదు.

ఇక్కడ మొదట నిర్మించిన అక్వేరియం వైశాల్యం 2,25,000 చదరపు అడుగులు. దాని నిర్మాణానికి అయిన ఖర్చు 32.5 లక్షల డాలర్లు. తర్వాత జత చేసిన ఓషనేరియం వైశాల్యం 1,70,000 చదరపు అడుగులు. దానికై ఖర్చుపెట్టింది నాలుగున్నర కోట్ల డాలర్లు. అలాగే 27వేల చదరపు అడుగులు గల వైల్డ్ రీఫ్ మీద కూడా నాలుగున్నర కోట్ల డాలర్లు వెచ్చించారు. మొత్తం మ్యూజియం వైశాల్యం 4,22,000 చదరపు అడుగులు. రెండున్నర గంటలపైగా అక్కడ గడిపి అరగంట ప్రయాణం చేసి హోటల్‌కి చేరుకున్నాం. మేం బస చేసిన హోటల్ అక్కడ మూడున్నర/నాలుగు నక్షత్రాల హోటలట. హోటల్ రూముల కోసం కూడా ఆ దేశంలో బిడ్డింగ్‌లు ఉంటాయని అప్పుడే తెలిసింది. ఓ గంట విశ్రాంతి తీసుకున్న తర్వాత పెద్ద బసవపున్నమ్మగారు వచ్చి భోజనానికి తీసుకెళ్లారు. తిరిగి హోటల్‌కి చేరుకునేటప్పటికి రాత్రి పదకొండయింది. మరుసటి రోజు ఉదయం వాళ్లను బ్రేక్ ఫాస్ట్‌కి ఆహ్వానించాం.

నేను, నరేంద్ర, భరత్, భరత్ వాళ్లత్తయ్య, వింధ్య చికాగో నగరాన్ని చూడ్డానికి బయల్దేరాం. చికాగో నగరం మోటో "URBS IN HORTO" అంటే వనంలో నగరమని అర్థమట. పేరుకు తగినట్లుగానే ఒక పక్కన డౌన్‌టౌన్, మరో పక్క నీరు, మధ్యలో పార్క్ ఉంది. రకరకాల పూల మొక్కలు, మైదానాలు ఉన్నాయక్కడ. అంతే కాకుండా పెద్ద మెటల్ డోమ్ ఒకటి ఉంది. దాని బరువు దాదాపు వంద టన్నులు. అది స్టెయిన్‌లెస్ స్టీలుతో చేయబడింది. కింది నుండి పైకి చూస్తే పైన మన ప్రతిబింబాలు కన్పిస్తాయి. ఒక పక్కగా వెళ్లి చూస్తే చికాగోకు సంబంధించిన ఎత్తైన భవనాల ప్రతిబింబాలు కనిపిస్తాయి. ఒక సభావేదిక కూడా ఉంది. అందులో రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆ వేదిక ముందు మెటల్ ట్యూబులు పందిరి వంటి నిర్మాణాన్ని చూసి తీరవలసిందే.

ఆ పక్కనే ఉన్న బస్టాపులో సిగ్నేచర్ టూరుకు చెందిన డబుల్ డెక్కర్ బస్సులున్నాయి. వాటిపై కూర్చుని ఎత్తైన భవనాల మధ్య కొంత దూరం ప్రయాణించాం. మధ్యలో ఒక స్టాపులో దిగి "స్కైడెక్ చికాగో" చూశాం. ఇది అమెరికా వరల్డ్ ట్రేడ్ సెంటర్ తర్వాత అత్యంత ఎత్తైన భవనంగా నిలిచిన సియర్స్ టవర్ (ఇప్పటి విల్ టవర్). మేం భూమి నుండి 1353 అడుగులు పైకి వెళ్ళాం. అంత ఎత్తుకు ఒక నిమిషంలో చేరడం చాలా ఆశ్చర్యమనిపించింది. అక్కడ్నుండి చూస్తే నాలుగు రాష్ట్రాల సరిహద్దులు కన్పిస్తాయి. అక్కడి అద్దాల బాల్కనీలో నిలబడితే గాలిలో తేలుతున్నట్లే ఉంది. తర్వాత భోజనం ముగించుకుని డౌన్‌టౌన్‌లో మిగతా భాగాలు తిరిగాం. బసవపున్నమ్మగారు ఆ పెద్ద భావనాల ఫొటోలు తీస్తూ కూర్చుంది. మా బస్సు మళ్లీ మిలీనియం పార్కు చేసేసరికి సాయంత్రం మూడు గంటలు కావస్తోంది. మా రెండు


షెడ్ అక్వేరియం

విల్ (సియర్స్) టవర్

రోజుల యాత్ర అలా ముగింపింది. అక్కడ్నుండి మూడు గంటలు ప్రయాణించి పియోరియా చేరుకున్నాం. ఇంకా చికాగోలో చూడాల్సిన ప్రదేశాలు ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్, హిల్టన్ చికాగో, నావీపియర్, వాటర్ టవర్స్, లింకన్ పార్క్, జూ, సైన్స్ మ్యూజియం వంటివి ఉన్నాయి.

నా భార్య బస్సు యాత్రలు చేసే స్థితిలో లేదు. అందుకే నాకు మాత్రమే తూర్పు తీరం వెంట బస్సులో విహార యాత్రకు ఏర్పాటు చేశాడు భరత్. అది జులై 17న న్యూయార్క్ సందర్శనతో మొదలై జులై22 న "నయాగరా" సందర్శనతో ముగుస్తుంది. నేను స్కూల్లో చదువుకునే రోజుల్లో కొండపల్లి, కొండవీడు, హంపి, విజయనగరం చూశాను. ఇరవయ్యేళ్లు వచ్చాకే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చూశాను. ఉద్యోగరీత్యా మద్రాసు, బెంగుళూరు, ఢిల్లీలకు ప్రయాణాలు చేశాను. ఇప్పుడు ఇలా ఒంటరిగా దేశం కాని దేశంలో వినోద యాత్ర చేస్తున్నాను. నేను ఒంటరిగా వెళ్లడం సాహసంగా భావించారట భరత్ మిత్రులు కొందరు.

జులై 17 ఉదయం పియోరియా విమానాశ్రయంలో దింపి వెళ్లాడు భరత్. అక్కడి నుండి చికాగో, న్యూయార్క్ మీదుగా వెళ్లి కెన్నడీ విమానాశ్రయంలో దిగాను. అక్కడికి గైడ్ రాలేదు. అతనికి ఫోన్ చేస్తే నా పేరు స్పెల్లింగ్ అడిగాడు. అంతలో మా అన్నయ్యగారబ్బాయి రామ్ మనోహర్ (మేమంతా లోహియా అని పిలుస్తాం) అక్కడికి చేరుకున్నాడు. నన్ను తన అపార్టుమెంటుకు తీసుకెళ్లాడు.

అతను విమానాశ్రయానికి వచ్చినప్పుడే కారు ముందు భాగంలో నంబర్ ప్లేట్ పై నెంబరుకు బదులుగా "లోహియా" అని ఆంగ్లంలో రాసి ఉంది. అది చూసి ఆశ్చర్యపోయా. ఆ విషయమే అడిగితే కొంత డబ్బు అదనంగా చెల్లించి అటువంటి సదుపాయం పొందొచ్చని చెప్పాడు. తన కారుమీద లోహియా అనే పేరు చూసి అదేమిటని అడిగే వాళ్లందరికీ ప్రముఖ సోషలిస్టు నాయకుడు డాక్టర్ రామ్ మనోహర్ లోహియాను గురించి చేప్పే అవకాశం లభించిందని సంబరపడ్డాడు.

నన్ను న్యూజెర్సీలోని "డేస్ హోటల్"లో దిగబెట్టి, రామ్ మనోహర్ రాత్రి పదిగంటల సమయంలో తిరిగి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు రిసెప్షన్‌లో నా టూర్ గైడ్‌కోసం వాకబు చేశాను. అక్కడి అమ్మాయి నేను విమానాశ్రయానికి వెళ్లాలని చెప్పింది. పెద్ద చిక్కే వచ్చిపడిందనుకున్నాను. ఎందుకైనా మంచిదని హోటల్‌వాళ్లు ఇచ్చిన లేఖ వాళ్లకు చూపించి, గైడ్ గురించి తిరిగి వాకబు చేశాను. ఇంతలో రూట్ గైడ్ రానే వచ్చాడు. "హమ్మయ్యా..." అని ఊపిరి పీల్చుకున్నాను.

జులై 18 ఉదయం ఏడు గంటలకు లోకల్ టూర్స్ వాళ్ల బస్సులో తూర్పుతీర యాత్ర ప్రారంభమయింది. బస్సులో ఉన్న యాత్రికుల్లో అత్యధికులు చైనా వాళ్లు. గైడ్ కూడా చైనా వాడిలాగే కన్పించాడు కానీ అమెరికా వాసి. ఔరంగాబాద్ ప్రాంతానికి చెందిన ఒక భారతీయ కుటుంబం కూడా ఆ బస్సులో ఉంది. వాళ్లు ముగ్గురు. నేనొకడిని. మొత్తం మేం నలుగురమే భారతీయులం ఆ బస్సులో. ఆ కుటుంబ పెద్ద కలకర్ణిగారు కలుపుగోలు మనిషి. పూనెలో కాపురముంటున్నారట. ఆయన భార్యతో అమెరికాలో ఉంటున్న వాళ్లమ్మాయి ఇంటికి వచ్చారట. వాళ్లమ్మాయి కూడా వాళ్లతో ఉంది. అల్లుడికి పని ఒత్తిడి వల్ల వీళ్లతో రాలేకపోయాడట. రెండు గంటల్లోనే ఆయనకూ నాకూ చనువేర్పడింది. నాకు హిందీ రావడం కూడా కారణం కావచ్చు, గానీ మిగతా యాత్రికులంతా కొంచెం టచ్‌మి నాట్‌లా ఉన్నారు. పూనె అమ్మాయి బాగానే గారాలు పోతుంది. ఆ నేపథ్యంలో ఆయన నాతో అన్నారు "మనం అబ్బాయిల కంటే అమ్మాయిల్నే గారాబంగా పెంచుతాం కదూ!" అని. వెంటనే ఫ్రాయిడ్ గుర్తుకొచ్చాడు. మరి వాళ్ల అమ్మాయి ఏమంటుందోననిపించింది. ఆ అమ్మాయి బిగించిన బుంగమూతి అలాగే ఉంది. నేను చిన్నగా నవ్వి ఊరుకున్నాను.

రామ్ మనోహర్ నన్ను న్యూయార్క్ నుండి న్యూజెర్సీకి తీసుకొచ్చిన మార్గంలో కాకుండా మరో మార్గంలో మా బస్సు న్యూయార్క్ బయలుదేరింది. ఒక పదినిమిషాలపాటు టన్నెల్ (సొరంగం) గుండా ప్రయాణం. భూగర్భ రైళ్ల సంగతి గుర్తుకు వచ్చింది.

ముందుగా మాకు వాల్‌స్ట్రీట్ చూపెట్టారు. వీధుల్లో సందడిలేదు. నిర్మానుష్యంగా ఉంది. టూరిస్టులుంటేనే వీధులకు కళ. బుల్ ఫొటో తీశాను. తర్వాత బ్రేక్‌ఫాస్ట్ చేశాం. ఐదు డాలర్లలోపే ఉంది. అయితే ఆ విలువను మన కరెన్సీలోకి మార్చి చూస్తే రూపాయల్ని తిన్నట్లే ఉంటుంది. మధ్యాహ్నం భోజనం ఒక పది డాలర్లకు మించి కాదు. రాత్రి భోజనం. 15 డాలర్లకు లభిస్తుంది. ఇంతలో మిగతా టూరిస్టు బస్సులు పదుల సంఖ్యలో చేరుకున్నాయి. అంతా సందడి సందడిగా ఉంది.

ఈ టూర్‌కు ప్యాకేజీ కింద 513 డాలర్లు. పైన మరో 500 డాలర్లు ఖర్చవుతున్నాయి. పియోరియా నుండి న్యూయార్క్‌కు, బఫెలో నుండి పియోరియాకు చేరుకోవాలంటే విమాన ప్రయాణానికి మరో 500 డాలర్లు ఖర్చవుతాయి.

తర్వాత వేక్స్ మ్యూజియం చూశాం. వివిధ రంగాల్లోని ప్రముఖుల్ని అక్కడ తీర్చిదిద్దారు. నాకు భారతదేశానికి సంబంధించి రాజకీయ రంగంలో మహాత్మాగాంధీ, చిత్ర పరిశ్రమకు సంబంధించి అమితాబ్ బచ్చన్ బొమ్మలు మాత్రం కనిపించాయి. బస్సులోని ప్రయాణీకులంతా వివిధ బొమ్మల పక్కన నిలబడి ఫొటోలు దిగారు. నేను ఐన్‌స్టీన్ బొమ్మ పక్కన నిలబడి ఫొటో తీయించుకున్నాను.

తర్వాత ఎంపైర్ స్టేట్ భవనంపైకి ఎక్కాం. న్యూయార్క్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను కూల్చివేసిన తర్వాత అక్కడ అత్యంత ఎత్తైన భవనం ఇదే. దీన్ని సంవత్సరంలో 365 రోజులు యాత్రికుల సౌకర్యార్థం తెరిచే ఉంచుతారు. ఇందులో 102 అంతస్తులున్నాయి. ప్రస్తుతం 84వ అంతస్తు వరకే వెళ్లనిస్తున్నారు. చికాగోలో అంతకు ముందు 1353 అడుగుల ఎత్తు నుండి పియర్స్ టవర్స్ (... చికాగో) అనే భవనం చూశాం. భవన దృశ్యా ఉన్నా, నదులు, రోడ్లు దృశ్య స్వభావాన్ని మార్చాయి. ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ నిర్మాణం 410 రోజుల్లో పూర్తి చేశారట.

గైడ్ "న్యూయార్క్" అంటే "యువర్ సిటీ" (మీ పట్టణం) అని అర్థమని చెప్పాడు. న్యూయార్క్ ప్రస్తుత మేయరు ఆ పదవికి మూడు పర్యాయాలుగా విజయఢంకా మోగిస్తున్నాడట. ఈయన వేతనం నామమాత్రంగా (సంవత్సరానికి 72సెంట్లు) తీసుకుంటారట. ఆయన్ని గొప్ప ప్రజా సేవకునిగా మా గైడ్ చెప్పాడు.


వాల్‌స్ట్రీట్‌లో బుల్...

వ్యాక్స్ మ్యూజియంలో గాంధీ....

(వైవారం మరిన్ని విశేషాలు)

అట్టమీది కథ



పాపికొండల్లో ప్రయాణం

ప్రతి ఏటా ఏదోక కొత్త ప్రదేశంలో వార్షిక సమావేశం జరుపుకునే 'ప్రజాశక్తి' విజయవాడ ఎడిషన్ మిత్రులు - ఈసారి రాజమండ్రిని వేదిక చేసుకున్నారు. తొలిరోజు సమావేశం పూర్తి చేసుకొని, రెండోరోజు పాపికొండల యాత్రకు బయల్దేరారు. ఆతిథ్యమిస్తున్న రాజమండ్రి ఎడిషన్ నుంచి మేం కూడా కొంతమందిమి వారితో కలిసి వెళ్లాం... ఆహ్లాదంగా సాగిన ఆ ప్రయాణ విశేషాల సమాహారమే ఈ ప్రత్యేక కథనం..

- సత్యాజీ

ఏదైనా విహార యాత్రకు బయల్దేరుతున్నప్పుడు ఎవరికైనా ఎలా ఉంటుంది? ఎంత ఉత్సుకత, ఎంత ఉత్సాహం, ఎంత సరదా... ఎంత సందడి...! పెద్దల తలపులు పిల్లల్లాగా, పిల్లల మనసులు దూదిపింజెల్లాగా తేలిపోతూ ఉంటాయి. వెళ్లాల్సిన చోటు గురించిన ఊహాలూ, ఊసులూ షికారు చేస్తూ ఉంటాయి. ఆరోజు ఉదయం వెలుగు రేఖలు విచ్చుకుంటున్న వేళ.... రాజమండ్రి లాంచీల రేవులో మేమంతా అలాంటి వాతావరణంలోనే తలమునకలై ఉన్నాం. మాలో చాలామందికి పాపికొండలు వెళ్లడం అదే మొదటిసారి. పైగా ఎన్నాళ్లినించో కంటున్న కల... అందుకే- చాలా ఉద్విగ్నంగా ఉంది. గోదావరి ఇంకా నిద్ర లేవని పసిపాపలా ఉంది. పిల్ల గాలులు చక్కిలిగిలి పెడుతుంటే... హాయిదనం అనుభవిస్తున్నట్టు- ప్రశాంతంగా ఉంది.

అద్భుతలోకంలోకి ప్రయాణం

రేవు నుంచి మా లాంచీ ప్రయాణం మొదలవ్వగానే ఏదో అద్భుతలోకానికి బయల్దేరామన్న ఫీలింగు కలిగింది. పుష్కరాల రేవు దగ్గర నూటయాభయ్యేళ్ల నాటి పాత బ్రిడ్జిని దాటుతున్నప్పుడు చాలామంది 'గోదావరి' సినిమాని గుర్తు చేసుకున్నారు. 'అదిగో... అక్కణ్నించే ఆ సినిమాలో లాంచీ బయలుదేరుద్ది...' అని గోదావరి మాత విగ్రహం వేపు చూపించాడు విజయవాడ సురేష్. 'ఒక పాటలో పిల్లలు ఈ బ్రిడ్జి మీంచే దూకుతారు...' అన్నాడు పవనమూర్తి. వాళ్ల మాటలు విని, సినిమా కళ్లలోంచి గోదావరిని చూస్తున్నట్టు అనిపించింది. నిజమే... కథలోనో, పాటలోనో గోదావరి నేపథ్యం ఉన్న సినిమాలు తక్కువేం కాదు.. నాటి 'అందాల రాముడు' మొదలుకొని, నిన్నా మొన్నటి 'గోదావరి', 'గోపి గోపిక గోదావరి' దాకా ... అన్నీ గోదావరి అందచందాలకు వెండితెర పట్టినవే! అందుకనే మా ప్రయాణంలో అడుగడుగునా సినిమా జ్ఞాపకాలు పరిమళిస్తూనే ఉన్నాయి.

రాజమండ్రి పేపరు మిల్లు దాటిన కాసేపటికి నిర్మాణంలో ఉన్న నాలుగో బ్రిడ్జి కనిపించింది. రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ఒత్తిడి తగ్గించటానికి గామన్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో ఈ వంతెన నిర్మాణం చేపట్టారు. రాజమండ్రి వైపు చాలావరకూ పిల్లర్లు పూర్తయ్యాయి. భారీ క్రేన్లు, ఇతర యంత్రాలూ పెద్దఎత్తున మోహరించి ఉన్నాయి. మేం ఆ ప్రాంతాన్ని దాటుతున్నప్పుడే తూర్పు వైపు సూర్యుడు నెమ్మదినెమ్మదిగా పైకి లేస్తున్నాడు. నది ఒడుపు, లోతూ అంచనా వేసుకుంటూ లాంచీని ముందుకు నడిపిస్తున్నాడు సరంగు. ప్రవాహం ఎక్కువగా ఉన్న ఎడమ (పశ్చిమ గోదావరి జిల్లా) వైపు మళ్లింది లాంచీ. ఆ గట్టు మీద వరుసగా ఉన్న తాటిచెట్లు వరద గోదారి ఊళ్ల మీదకి ఉరక్కుండా అడ్డుకునే రక్షక భటుల్లా కనిపించాయి. కుడి (తూర్పు) వైపున మాత్రం అలాంటి ఒడ్డు దరిదాపుల్లో కనిపించలేదు. కనుచూపు మేరా ఇసుకపర్రలే! ఈలోగా లాంచీలోనే తయారైన ఉప్మా, మైసూరు బజ్జీలూ వేడివేడిగా పైకి వచ్చాయి. మేం గబగబా లాగించేలోగానే టీ కూడా సిద్ధంగా ఉంది. అల్పాహారం పూర్తి చేసిన కాసేపటికి- వేగేశ్వరపురం రేవు, తాళ్లపూడి, తాటిపూడి, గూటాల రేవు దాటేశాం.

గోదారిలో ఆటవిడుపు

సమయం 9 గంటలు దాటింది. ఎండ చుర్రెక్కుతోంది. ఆ తాపాన్ని చల్లార్చుతూ చల్లని పిల్ల గాలులు జోరందుకున్నాయి. పట్టిసీమ చేరుకున్నాం. అక్కడ నదికి మధ్యలో ఎత్తయిన కొండమీద పురాతన కాలం నాటి శివాలయం ఉంది. శివరాత్రికి ఇక్కడ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. పట్టిసీమ దాటాక... నీటిప్రవాహం ఎక్కువగా ఉంటుందని ప్రయాణం వేగంగా సాగుతుందని అనుకున్నాం. అలా అనుకున్న కొద్దిసేపటికే ... లాంచీ ఇసుక మేటలో ఇరుక్కుపోయింది. దానిని వెనక్కి మళ్లించే ప్రయత్నంలో లాంచీకి అడుగున ఉండే ఫ్యాను విరిగిపోయింది. ఆహ్లాదంగా సాగుతున్న ప్రయాణానికి ఆకస్మిక ఆటంకం ఏర్పడింది..!

'ఏమైంది... ఏమైంది...' ప్రశ్నలు మీద ప్రశ్నలు...

'ఇప్పుడెలాగా..?' ఎవరిదో నిట్టూర్పు.

'ఎప్పటికి పూర్తవుతుంది?' మళ్లీ ప్రశ్న.

'స్పేరు పార్టుంది. దాన్నిప్పేసి, దీన్ని బిగించేడిమే...' సరంగు భరోసా.

అందాకా ఏం చేయాలి?... ఎవరో లాంచీ మీంచి నిచ్చెన వేశారు. కొందరు కిందికి దిగారు. నీరు మోకాలి లోతు కూడా లేదు. చాలాదూరం వరకూ దిబ్బలాగానే కనిపిస్తోంది. ఇంకొందరు దిగారు. ఇటూ అటూ గెంతారు. అది చూసి మరికొందరు... ఇంకొందరు... కాసేపట్లో దాదాపు అందరూ దిగేశారు... ఉత్సాహంగా ఉంది, నీళ్లను చూసి. లోతు లేదు కాబట్టి- ఉల్లాసంగా ఉంది. కొన్ని క్షణాల్లో అది ఆటస్థలం అయిపోయింది. ఆ పక్క కబడ్డీ, ఈ పక్క ఈత, ఇంకొక పక్క కుస్తీ.... ఆ సరదా ఆటలతో అవాంతర తరుణం కూడా వినోద క్షణంగా మారిపోయింది. పాపికొండల యాత్రికులు అందరికీ- నది మధ్యలో ఇలా సందడి చేసే అదృష్టం పట్టదేమో, బహుశా..!

'ఇది విహారంలో కొంత విరామం... ' అన్నారు మా బృందం నాయకుడు వెంకట్రావు గారు. 'ఆటంకాన్ని వినోదంగా మార్చేశారు మనోళ్లు...' అని సంబరపడ్డారు కోటిరెడ్డి, వెంకటేశ్వరరావు... సరదా శృతి మించి వేరే పరిణామాలకు దారి తీయకూడదని ఈ ముగ్గురూ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చెబుతూనే ఉన్నారు..

లాంచీలో నవ్వుల వాన!

దాదాపు రెండు గంటల పాటు నదిలో ఈతలూ ఆటలూ విహారాలూ విజయవంతంగా పూర్తి చేసుకున్నాం... రిపేరు ఇంకా పూర్తి కాలేదు. 'అయిపోవొచ్చింది' అంటూనే ఉన్నారు.. మరో రెండు గంటల టైం గడిచిపోయింది. ఆ రెండు గంటలూ లాంచీ నవ్వుల దరువులో ఊగిపోయింది. పిడుగురాళ్ల నాగేశ్వర్రావు, నర్సారావుపేట నారాయణ- తమ రోజువారీ పనిలో ఎదురైన అనేక సంఘటనల గురించి హావభావాలతో వివరించి, కడుపుబ్బ నవ్వించారు. ఒక్కోసారి కొన్ని సంఘటనలూ సన్నివేశాలూ జరిగినప్పుడు భయాన్నో ఉత్కంఠనో కలిగిస్తాయి. ఆ తరువాత నలుగురితో పంచుకున్నప్పుడు వినోదంగా మారిపోతాయి. దాదాపు రెండు గంటల పాటు అక్కడ విరిసిన ఇలాంటి హాస్య కదంబాలెన్నో...! హరిశ్చంద్ర కాటిసీను పద్యాలూ... సాంఘిక నాటకాల్లోని విలన్ వికటాట్టహాస డైలాగులూ...!! మండపేట సుబ్రమణ్యం మిమిక్రీతో విజృంభించాడు. ప్రసిద్ధ రాజకీయ నాయకులు, సినిమా నటులూ మాతో పాటు పాపికొండలు యాత్రకు వచ్చి ఉంటే- ఈ సందర్భంలో ఎలా మాట్లాడతారో అద్భుతంగా అనుకరించి, అలరించాడు. లాంచీ ఆగితే ఆగింది కానీ, చాలా కళల్ని, కళాకారుల్నీ పరిచయం చేసింది!

లాంచీ రెడీ.. భోజనం తయార్..!

మేమిలా ఉల్లాసంగా గడుపుతుంటే – కుక్ చౌదరీ, అతడి అసిస్టెంటు శ్రీనూ వాళ్ల పని వాళ్లు కానిచ్చారు. సరిగ్గా మధ్యాహ్నం 12.30కి 'లాంచీ రిపేరు పూర్తయింది' అన్న శుభవార్తతో పాటు 'భోజనం తయార్!' అన్న పసందైన వార్త కూడా వినిపించారు. అప్పటిదాకా ఆడిపాడీ, పడిపడి నవ్వీ అలసిపోయిన వాళ్లకి- 'భోజనం' అనగానే ఎక్కడ లేని ఆకలీ గుర్తొచ్చింది. క్షణాల్లో లాంచీ టెర్రాస్ పైకి చేరిపోవడం; వెజిటబుల్ బిర్యానీ, బంగాళదుంప కుర్మా, పప్పు, గుత్తి వంకాయ కూరా, సాంబారూ, పెరుగులతో ఆత్మారాముడిని శాంతింపచేయడం... అంతా అరగంటలో పూర్తయిపోయింది. పేరంటాలపల్లిలో చేయాల్సిన



పాపికొండలు నేపథ్యంగా గ్రూపు ఫొటో

లంచ్‌ను మేము పోలవరం దగ్గర్లోనే పూర్తి చేసి, సరిగ్గా ఒంటిగంటా ఐదు నిమిషాలకి ప్రయాణం మొదలెట్టాం.

పశ్చిమ వైపున ఉన్న పోలవరం చేరేసరికి రేవు పొడవునా రాజహంసల్లా కొలువు తీరి కనిపించాయి లాంచీలు. తూర్పున పురుషోత్తపట్నం రేవులోనూ కొన్ని లాంచీలు లంగర్లు వేసుకొని ఉన్నాయి. రాజమండ్రి కన్నా కూడా ఎక్కువ లాంచీలు ఈ రెండు రేవుల్లోంచే బయల్దేరతాయి. ఇసుకమేటలతో ఇబ్బంది లేకుండా, సమయం కాస్త కలిసొచ్చేలాగా... చాలామంది ఇక్కడినుంచే యాత్ర ప్రారంభిస్తారు. పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా వచ్చేవాళ్లు పోలవరంలో, తూర్పు గోదావరి జిల్లా మీదుగా వచ్చేవాళ్లు పురుషోత్తపట్నంలో లాంచీ ఎక్కుతారు.

మా లాంచీ పోలవరం రేవు దాటాక కొంత దూరంగా కొండమీద ఏదో దేవాలయం కనిపించింది. అదేంటని ఎవరో అడిగితే- 'అది మహానందీశ్వర ఆలయం. జానకీరాముడు సినిమాలో కొన్ని సీన్లు అక్కడే తీశారు...' అన్నాడు సురేష్ రాజు. ఆ గుడి తరువాత... తూర్పు వైపున మెట్ట భూములకు సాగు నీరందించే పుష్కర ఎత్తిపోతల పథకం, గిరిజన గ్రామాల దాహార్తిని సత్యసాయి తాగునీటి పథకం తారసపడ్డాయి.

పోలవరం ప్రాజెక్టు ఇక్కడే కడతార్ట..!

ఇంకో 20 నిమిషాల ప్రయాణం తరువాత... పోలవరం ప్రాజెక్టు నిర్మించే ప్రదేశం చేరుకున్నాం. పశ్చిమ గోదావరి జిల్లా వైపున దూరంగా పెద్దఎత్తున మట్టికట్ట కనిపించింది. తూర్పు గోదావరి జిల్లా వైపున ఒడ్డుకు ఆనుకొని ఉన్న ఎత్తయిన కొండపై తెల్లని రంగు వేసిన రాయి కనిపించింది. ఈ రెండింటి మధ్యా నిర్మిస్తారట అడ్డుకట్ట... ఆ కొండ ఎత్తున నిర్మాణం చేపడితే... ఇక అవతలి భాగంలో ఉన్న కొండలూ కోనలూ ఊళ్లూ భూములూ అన్నీ మటుమాయం! ఇక ఇక్కడి నుంచి తారసపడే సమస్తం పోలవరం ప్రాజెక్టులో జలసమాధి అవుతుందన్న భావన ఒకింత కలవరపాటుకు గురి చేసింది.

ఈ నిర్మాణ ప్రాంతానికి పై భాగాన పాపికొండలు ఒక్కటే కాదు, చాలా ఊళ్లున్నాయి. అందులో వేలాది మంది జనం ఉన్నారు. వాళ్ల తరతరాలుగా తిరుగాడిన చెట్లూ చేమలూ, అడవీ, పోడు భూమీ; వాగులూ, పరిచిత జంతువులూ పక్షులూ... అనేకం ఉన్నాయి. అన్నిటికన్నా కూడా పాపికొండలు మునిగిపోతాయన్న ప్రచారం... పర్యాటక రంగానికి ఆదాయ వనరుగా మారింది. ఎప్పుడూ లేనిది గత ఐదేళ్లుగా పాపికొండలను సందర్శించే యాత్రికుల సంఖ్య పెరిగింది. మన పరిధిలోని సహజ సిద్ధ అద్భుతాన్ని మిస్సవుతామేమోనన్న ఆందోళనే ఈ సందర్శనా తపనకు కారణం.

'చింతామణి..' సూసెల్లండి...

ఇక్కడినుంచి ఐదు నిమిషాలు ప్రయాణించి, ఒక మలుపు తిరుగుతుండగానే- చిన్న లాంచీ ఎదురొచ్చింది. దాన్నిండా పరిసర గ్రామాల పిల్లలూ మహిళలూ... చాలా సంతోషంగా కనిపించారు. మావైపు చూసి పిల్లలు ఆనందంగా చేతులూపారు... వాళ్లంతా గండి పోశమ్మ గుడికి వెళ్లొస్తున్నారని ఆ పరిసరాల గురించి బాగా తెలిసిన సురేష్ రాజు చెప్పాడు. ఆ ప్రస్తావన ఇంకా పూర్తి కాకుండానే తూర్పు వైపు ఒడ్డున చింతచెట్ల మధ్య కనిపించింది గండి పోశమ్మ గుడి. గండి పోశమ్మ చుట్టుపక్కల గిరిజన గ్రామాలకు ఆరాధ్య దేవత. గుడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ- పశ్చిమ గోదావరి పరిధిలోని గిరిజనులు ఎక్కువగా సందర్శిస్తారని గొందూరులో మా మిత్రుడు సత్యనారాయణ చెప్పాడు. 'గండి పోశమ్మ ఉత్సవాలు నిన్నే ప్రారంభమయ్యాయి.



తాటిపూడి ఎత్తిపోతల పథకం

కొల్లూరులోని హట్స్

ఈరోజు రాత్రికి 'చింతామణి' నాటకం... తిరుగొచ్చి ఇక్కడుండి పొండి.. సూసెల్దురు గానీ...' అన్నాడు.

'జనం బాగా వస్తారా?' అనడిగితే- 'ఒకప్పుడైతే ఇసకేస్తే రాలనంత జనం... ఇప్పుడా సీను లేదు. చాలా ఇళ్లల్లో టీవీలూ, డీవీడీ ప్లేయర్లూ ఉన్నాయి. గిరిజన గ్రామాల్లోనూ శానా మార్పు వచ్చేసింది...' అని చెప్పాడు. ఈ పోశమ్మ దేవాలయానికి ఏటా రూ.16 లక్షల ఆదాయం వస్తుంది.. దాంతోనే దీపధూపాలూ, సంబరాలూ జరిపిస్తాం..' అని వివరించాడు.

అదే సినిమా షూటింగుల ఇల్లు..!

కుడివైపున ఉన్న పూడిపల్లి దాటుతున్నప్పుడు- 'అదిగో... కనపడుతున్న ఆ ఇంట్లో చాలా షూటింగులు జరిగాయి. 'గోపి గోపిక గోదావరి' అక్కడే తీశారు..' అని మళ్లీ సినిమా రీలు తిప్పాడు పవన మూర్తి. 'ఇంకొంచెం ముందుకెళితే ఉండే ఇసుకతిన్నెల్లో సెట్టింగులేసి, 'వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు...' తీశారు..' అన్నాడు బ్రహ్మం. 'అదీ ఇదీ కాదు.. సామీ... వంశీ సినిమాలన్నీ గోదార్లోనే తీశాడు. మిగతావాళ్లు ఇప్పటిదాకా దాదాపు 150 సినిమాల్లో గోదారిని ఏదొక రూపంలో చూపించారు...' సినిమా చరిత్ర ఎత్తుకున్నాడు పొణకం అప్పారావు..

ఆ కథ అలా సాగుతుండగానే... ఇసుకమేటలకు, గోదావరికి మధ్య క్రికెట్టాడుకుంటూ కనిపించారు పదీ పన్నెండేళ్ల పిల్లలు. 'ఇది ఇక్కడిదాకా వచ్చేసిందీ...' అని ఆంజనేయులు ఆశ్చర్యం వ్యక్తం చేయబోతే- 'ఇక్కడ అక్కడ అను వ్యత్యాసం లేదు... ఎందెందు వెతికి చూసినా అందందే కలదు...' అని క్రికెట్టు విస్తరణపై ఒక విస్పష్ట ప్రకటన చేశాడు వలీ..

దేవీపట్నం వచ్చింది. అది తూర్పు గోదావరి జిల్లాలో మండల కేంద్రం. పాపికొండలకు వెళ్లే ప్రతి లాంచీ- వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడూ ఇక్కడి పోలీస్‌స్టేషన్లో రిపోర్టు చేయాలి. దానికి సమీపంలోనే అల్లూరి సీతారామరాజు మన్యం పోరాటం సందర్భంగా 1922లో దాడి చేసిన పాత పోలీసు స్టేషను ఉంది. ఇక్కడినుంచి గోదావరి వెడల్పు తగ్గి, ప్రవాహ ఉరవడి పెరిగినట్టు కనిపించింది. ఎడమ (పశ్చిమ) పక్కన రాళ్ల ఒడ్డు ప్రారంభమైంది.... కుడిపక్క కొంత ఇసుకతిన్నెల మైదానం... తరువాత కొండలు మొదలు... కొంతసేపటికి సింగనపల్లి ఒడ్డు వైపు మళ్లింది లాంచీ. అక్కడ అటవీశాఖ వాళ్ల అనుమతి తీసుకొని- బయల్దేరింది.

జలమే జవమూ జీవమూ!

దారిపొడవునా అక్కడక్కడ ఊళ్లు కనిపిస్తూనే ఉన్నాయి. కొత్తూరు, తెల్లవరం, మందావరం, వాడపల్లి, ఎర్రవరం, పైడాకుల, మావిడి తూటిగుంట, టేకూరు, చీడూరు, శివగిరి.... వీటన్నింటినీ దాటుకుంటూ సాగుతోంది మా ప్రయాణం. ప్రతి ఊరి నుంచీ గోదావరి నదిలోకి రెండు మూడు కాలిబాటలు ఉన్నాయి. ఎగువ రేవు తాగునీటికైతే, దిగువ రేవు కాలకృత్యాలకు. చాలా రేవుల్లో ఆడవాళ్లు బట్టలుతుకుతూ, సిమెండి బిందెలతో నీళ్లు మోసుకెళుతూ కనిపించారు. అక్కడక్కడ బట్టలుతికే మహిళలు చీర చెంగులు చెరోవైపునా పట్టుకొని చేపలు వేటాడుతున్నారు. బట్టలుతుక్కొని... బిందెలు తోముకొని... స్నానం చేసి... కూరకి తాజా చేపలు పట్టుకొని... ఆడవాళ్లు గట్టెక్కుతుంటే అనిపించింది : గోదారి బహుళ ప్రయోజనకారి! అని.

విచిత్రమేమిటంటే- ఈ ఊళ్లకు ఆనుకొని గోదావరి ప్రవహిస్తుంది కానీ, ఆ పక్కనే ఉన్న భూముల్లోకి చుక్కనీరు కూడా వెళ్లదు.. నది పల్లం.. భూమి మెరక కావటంవల్ల వచ్చిన సమస్య ఇది. 'నీరు పల్లమెరుగు' అని ఊరుకుంటే- రైతు కృషీవలుడు ఎలా అవుతాడు? చాలాచోట్ల ఆయిలింజన్లు పల్లాన ప్రవహిస్తున్న నీటిని పుక్కిట పట్టి గట్టవతలి మడుల్లోకి గిరాటు వేస్తున్నాయి. అలా నేల తడిసిన మేరంతా అరటితోటలు, మొక్కజొన్న, మిరపతోటలూ నవనవలాడుతూ కనిపించాయి. రేప్పొద్దున... పోలవరం ప్రాజెక్టు పూర్తయితే- ఈ మళ్లనిండా నీళ్లుంటాయి కానీ, పండే భూములుండవు, పండించే మనుషులూ ఉండరు!

ఆవులే ఉన్నాయ్... గేదెలు కనపడలేదు..!

మా లాంచీమీంచి చూస్తుంటే- ఎడమవైపు గోదావరి ఒడ్డున ఆర్టీసీ బస్సు కనిపించింది ఒకచోట... అది టేకూరు వెళ్లి వస్తోంది. బస్సు వచ్చే ఆఖరి ఊరు అదేనట! ఇక అక్కణ్నుంచి మిగిలిన ఊళ్లకు నడిచి వెళ్లాల్సిందే! కుడిపక్కన తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కొండమొదలు గ్రామం ఉంది. ప్రతి ఆదివారం అక్కడ జరిగే సంతకు వచ్చి, గిరిజనులు తమకు కావల్సిన నిత్యావసరాలు కొనుక్కుంటారు. పర్వత సానువుల్లోనూ, నదీతీరంలోనూ చాలాచోట్ల ఆలమందలు కనిపించాయి. పర్వతాల్లో, ఎగుడు దిగుడు ప్రాంతాల్లో సులభంగా తిరగ్గలుగుతాయని ఆవులు, ఎద్దులనే గిరిజనులు సాకుతారు. గేదెలు ఎక్కడా కనిపించలేదు. కొండమొదలు దాటాక- కుడిపక్క తాటివాడ, ఎడమపక్క తెల్లదిబ్బలు తారసపడ్డాయి. గోదావరి జిల్లాల సరిహద్దు అక్కడితో పూర్తయి, ఖమ్మంలోకి ప్రవేశించాం. పాపికొండల సౌందర్యం, గోదావరి గాంభీర్యం అక్కడినుంచే అనుభవంలోకి వచ్చాయి.

ఉప్పొంగిపోయింది మనసు..!

ఇంకో అరగంటలో అక్కడికి చేరతామనగానే- దూరం నుంచి అద్భుతంగా కనిపించాయి పాపికొండలు. ఆకాశాన్ని చుంబిస్తున్నట్టు, విశాల జలధిలో శిలా పుష్పం విరిసినట్టు, బలమైన ఏనుగుల గుంపు నదికి అడ్డంగా నిలబడినట్టు... ఎన్నెన్నో భావచిత్రాలు మనసులో మెదిలాయి. అక్కడిదాకా గోదావరిలో ప్రయాణం ఒక ఎత్తు... పాపికొండల్లో ప్రయాణం మరొక ఎత్తు! ఎటు చూసినా ఎత్తయిన కొండలు... ఒకదాని తరువాత ఒకటిగా అలా సాగుతూనే ఉన్నాయి. రాజమండ్రి దగ్గర 3.5 కిలోమీటర్ల మేర విస్తరించిన గోదావరి

ఎక్కడో పుట్టి.. ఇక్కడే పెరిగి...

గోదావరి నది పుట్టింది మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలోని సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో త్రయంబకం అనే చోట. అక్కడ సన్నని జలపాతంలా ప్రారంభమై, తూర్పు కనుమల్లోకి వచ్చేసరికి విశ్వరూపం దాలుస్తుంది. దీని మొత్తం పొడవు 1450 కిలోమీటర్లు కాగా, మన రాష్ట్రంలో 927 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది. గోదావరి మన రాష్ట్రంలోకి ప్రవేశించాక- మంజీర, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, పెద్దవాగు, సీలేరు, కిన్నెరసాని వంటి ఉప నదులు దాన్లో సంగమిస్తాయి. పాపికొండల మధ్య గోదావరి 60 మీటర్ల వెడల్పూ, సుమారు 200 మీటర్ల లోతూ ఉంటుంది. అక్కడినుంచి కొండలను ఒరుసుకుంటూ- పోలవరం వద్ద మైదానంలోకి ఉరుకుతుంది. వరదోధృతి వేళ పట్టపగ్గాల్లేక ప్రవహించి, తన దారిని అంతకంతకూ విస్తరించుకుపోతుంది. దాని వెడల్పు రాజమండ్రి దగ్గర 3.5 కిలోమీటర్లు కాగా, ధవళేశ్వరం వద్ద ఏకంగా ఏడు కిలోమీటర్లు! ధవళేశ్వరం దిగువకు వెళ్లాక- గోదావరి రెండు దారుల్లో ప్రయాణం చేస్తుంది. తూర్పు దిక్కుగా సాగేది గౌతమి.. పశ్చిమంవైపు వెళ్లేది వశిష్ఠ. తరువాత అవి ఏడు పాయలుగా విడివడి సముద్రంలో కలుస్తాయి. ఈ ఏడు పాయల మధ్య ఉన్న సారవంతమైన సాగుభూమే డెల్టా ప్రాంతం! గోదావరి జిల్లాల సౌభాగ్యమంతా ఇక్కడే ఉంది. గోదావరి నది ఎక్కడ పుట్టి, ఎక్కడెక్కడ ప్రవహించినా- విస్తారమైన ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నది గోదావరి సీమలోనే! అంత మేలు ఒనకూర్చుతున్నందువల్లే- విశాలమైన రెండు జిల్లాలకు గోదావరి నామధేయం. నిజానికి గోదావరి నది కొన్ని వందల ఏళ్ల పాటు ఈ ప్రాంత ప్రజలకు దుఃఖదాయిని. తరచూ విరుచుకుపడే కరువూ వరదలతో గోదావరి ప్రాంతం విలవిల్లాడిపోయేది. ఆ కష్టనష్టాలను స్వయంగా చూసిన ఆర్థర్ కాటన్ 1847-52 మధ్య ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మించటం ద్వారా గొప్ప మార్పుకు శ్రీకారం చుట్టాడు. అందుకే- ఇక్కడి ప్రజలు గోదావరిని, ఆర్థర్ కాటన్‌ని ప్రత్యక్ష దైవాలుగా భావిస్తారు.


గోదావరి బ్యారేజీ

పాపికొండలకు మీరూ వెళతారా?

పాపికొండల్లో ప్రయాణం అంటే ... ప్రకృతి మూలాల్లోకి వెళ్లటం. కొన్ని వందల, వేల సంవత్సరాల క్రితం మన చుట్టూ ఉండే గాలీ నీరూ, చెట్లూ చేమలూ, వాగులూ వంకలూ ఎలా ఉండేవో స్వయంగా చూడటం. ప్రకృతి ప్రేమికులు ప్రతి ఒక్కరినీ ఈ యాత్ర కచ్చితంగా అలరించి తీరుతుంది.ఇటు రాజమండ్రి నుంచి, అటు పోలవరం నుంచి అనేక ట్రావెల్ ఏజెన్సీలు ఈ టూరును అందిస్తున్నాయి. అలాగే ఖమ్మం జిల్లా నుంచి కూడా పాపికొండలు వెళ్లి రావొచ్చు. ఇక ఈ టూరుకు రకరకాల ప్యాకేజీలు ఉన్నాయి. పాపికొండల వరకూ వెళ్లి రావడం, అక్కడినుంచి భద్రాచలం వెళ్లడం, లేదా కొరుటూరు, కొల్లూరు వంటి చోట్ల రాత్రి బస చేయడం వంటివి... ఆసక్తినిబట్టి, సమయాన్ని బట్టి ఎంచుకోవొచ్చు. దాదాపు అన్ని ప్యాకేజీల్లోనూ ఉదయం, సాయంత్రం అల్పాహారం; మధ్యాహ్నం భోజనం కలిసి ఉంటాయి. టికెట్టు మనిషి ఒక్కంటికి రూ.350 నుంచి రూ.600 వరకూ ఉంది. కొన్ని ఏజెన్సీలు ఏసి బోట్లను కూడా ఏర్పాటు చేస్తాయి. ఎక్కువ సంఖ్యలో బంధువులో, స్నేహితులో కలిసి వెళితే– అచ్చంగా మనకోసమే లాంచీయో, బోటో ఏర్పాటు చేసుకోవొచ్చు.ఏపి టూరిజం, ఆనంద్ రీజెన్సీ లాంచీలూ, ఏర్పాట్లూ కచ్చితంగా ఉంటాయి. కొన్ని ప్రయివేటు లాంచీల్లో నిర్వహణ సరిగ్గా ఉండదు. నిర్వాహకుల ఏర్పాట్లతో సంబంధం లేకుండా తినుబండారాలూ, పుష్కలంగా తాగునీరు వెంట తీసుకువెళ్లడం మంచిది.

లాంచీలో...

పాపికొండల్లో సెల్‌ఫోన్లేవీ పనిచేయవు.సాధారణంగా రాజమండ్రినుంచి పాపికొండలు వెళ్లిరావటానికి 12 గంటల సమయం పడుతుంది. ఎంత తొందరగా బయల్దేరితే అంత మంచిది. రాత్రి 7, 8 గంటలకు ముందే నది ప్రయాణం ముగించుకోవడం ఉత్తమం. నదిలో నీరు తగ్గేకొద్దీ ప్రయాణంలో రిస్కు పెరుగుతుంది. లాంచీలూ, బోట్లూ తరచూ ఇసుకతిన్నెల్లో ఇరుక్కుపోతుంటాయి. సాధారణంగా సెప్టెంబరు – ఫిబ్రవరి మధ్యనే పాపికొండల పర్యటనకు వెళ్లాలి. వేసవిలో వెళుతున్నప్పుడు నదిలో నీటిమట్టం తగినంత ఉందా? లేదా? తదితర విషయాలన్నీ విచారించాలి.పాపికొండలు టూరు ప్యాకేజీలకు సంబంధించిన సమాచారం, ఫొటోలూ, సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లూ నెట్లో చూడవచ్చు. కొంతమంది పర్యాటకులు తమ అనుభవాలను, ఆయా ప్యాకేజీల మంచిచెడ్డలను బ్లాగుల్లో పెడుతున్నారు. వాటిని ఒకసారి చూడడం ద్వారా మీ యాత్రను మరింత బాగా ప్లాన్ చేసుకోవొచ్చు. రాజమండ్రి నుంచి లాంచీ వెళ్లటానికి ఇబ్బంది అయితే– అటు పట్టిసీమ, పోలవరమో, ఇటు పురుషోత్తమపట్నమో నిర్వాహకులే తీసుకువెళతారు. గంట రోడ్డు ప్రయాణంతో అక్కడికి చేరుకోవొచ్చు. దానివల్ల నదిపై సాగే ప్రయాణం కొంత కలిసొస్తుంది. మీ వెంట మంచి కెమెరా తీసుకెళ్లడం మర్చిపోకండి. పాపికొండలు జ్ఞాపకాలను పదికాలాల పాటు పదిలంగా భద్రపర్చుకోవాలంటే– ఈ సాధనం తప్పనిసరి!

ఇక్కడ చిన్న కాలువలా సన్నబడిపోయి, విచిత్రంగా కనిపించింది. లావు తగ్గిన స్థాయిలోనే లోతు పెరుగుతుంది. ఇక్కడ లోతు దాదాపు 350 అడుగులు ఉంటుందని, ప్రవాహ వేగం కూడా ఎక్కువని సరంగు శంకర్రావు చెప్పాడు. 'పాపికొండల ఎత్తును తేరిపారా చూడాలంటే– తల ఎత్తితే సరిపోదు. పడుకొని చూడాల..' అన్నాడు మా లాంచీ కుక్ చౌదరి. అతడి మాటల్లో అతిశయోక్తి ఏమాత్రమూ లేదు. మా అనుభవం కూడా అదే! ఆ పర్వతాల ఉన్నతే కాదు, అందమూ అద్భుతమే! ఎన్నెన్నో రంగులు పొదువుకున్న వాటి వర్ణసౌందర్యం వర్ణనాతీతం. చెట్లు ఆకుల రాల్చిన చోట గజరాజ గాంభీర్యం... చివుళ్లెత్తుతున్న చోట జేగురురంగు విలాసం... లేతాకుల లేవళం పరిమళించే దగ్గర చిలకాకుపచ్చ సింగారం... ముదరాకులు మోహరించిన చోటల్లా హరిత వర్ణ సోయగం.. ఒక్కోచోట చెట్టుచెట్టంతా పసుపుపచ్చని పూల తోరణం... మరోచోట మెరుపులా తేజరిల్లే తెల్లపూల అందం...!

కాసేపు మాటలేకుండా చిత్తరువులైపోయాం. అలా చూస్తూ.. ఆస్వాదిస్తూ మైమరచిపోయాం. ఇంతలో కొంతమంది తేరుకొని... ఇలాంటి చోట మన ఉనికిని శాశ్వతం చేయాలని ఫొటోలకు ఉపక్రమించారు... విడిగానూ, గ్రూపులుగానూ పాపికొండల నేపథ్యంలో కెమెరా ముందు పరవశించిపోయారు. ఆ ఉద్విగ్నతను మోసుకుంటూ దాదాపు అరగంట పాటు నడిచింది లాంచీ. ఆ కొండల మధ్య కొలువై కనిపించింది కొల్లూరు అనే చిన్న ఊరు. నదీతీరంలో పర్యాటకులు రాత్రిపూట బస చేయటానికి 20 వరకూ చిన్న చిన్న గుడిసెలు కనిపించాయి. అటు భద్రాచలం నుంచి, ఇటు రాజమండ్రి నుంచి వచ్చే పర్యాటకులు కొందరు అక్కడ బస చేస్తారు. ఆ కొండలు దాటాక మా ప్రయాణంలో ఆఖరి మజిలీ ... పేరంటాలపల్లి వచ్చింది. అప్పటిదాకా కాసిన ఎండదెబ్బకు నీరసించిపోయిన సూర్యుడు ఎర్రబడ్డ ముఖంతో పాపికొండల్లోకి దిగిపోతున్నాడు.

ప్రశాంత ప్రదేశం.. పేరంటాలపల్లి

నదికి ఎడమవైపున బాగా ఎత్తయిన ప్రదేశంలో ఉంది పేరంటాలపల్లి. ఒడ్డున తలకిందులుగా తపస్సు చేస్తున్న జటధారిలా ఉంది చింతచెట్టు. 1984లో వచ్చిన వరదోధృతికి మట్టంతా కొట్టుకుపోయి వేళ్లన్నీ బయటకి వచ్చేశాయట! 62 కుటుంబాలకు చెందిన కొండరెడ్లు ఉన్నారిక్కడ. పర్వతాలు తప్ప వ్యవసాయ భూమి లేదు. వెదురుతో బొమ్మల తయారీ, గోదావరిలో చేపలవేట... వాళ్ల జీవనాధారం. 'కొయిద వెళ్లి రేషను బియ్యం తెచ్చుకుంటాం. ఇతర సామాన్లకోసం కొండమొదలు సంతకెళతాం... ' అని చెప్పాడు ఆ ఊళ్లోని బాలకృష్ణారెడ్డి.

ఊళ్లో శ్రీ రామకృష్ణ మునివాటం ఉంది. ఎంతో ప్రశాంతంగా ఉంది. అక్కడ పూజారులూ, దక్షిణలు వంటి సాంప్రదాయాలు నిషిద్ధం. ఆలయ గోపురంపై ఒకపక్క శిలువ, మరోపక్క స్వస్తిక, ఇంకొకపక్క ఓంకారం, క్రిసెంట్, మరొకపక్క పారశీకుల జ్వాలాకలశం కనిపించాయి. అది సర్వమత సౌభ్రాతృత్వానికి సంకేతంగా భాషించింది. గుడి ప్రాంగణంలో ఫొటోలు తీయకూడదనే నిబంధన కూడా ఉంది. ఆలయం పక్కనుంచి సన్నని జలపాతం జాలువారుతోంది. ఆ చల్లని నీటితో ముఖం కడుక్కొని, దాహం తీర్చుకొని... కాసేపు సేద తీరాం. గిరిజన మహిళలు వెదురుబద్దలతో తయారు చేసిన బోట్లు, పుష్పగుచ్ఛాలూ కొని, జ్ఞాపకాలుగా వెంట తెచ్చుకున్నాం.

ఉత్సాహపూరిత జ్ఞాపకం

చీకటి పడిపోతే ప్రయాణానికి ఇబ్బంది అని మా బృంద నాయకులు తొందర పెడుతుంటే– ఆ ఊరిని వదల్లేక వదల్లేక వచ్చి, లాంచీ ఎక్కాం. వెనక్కి తిరిగి మరోసారి పాపికొండల్లోకి ప్రవేశించాం. ఎంతో నిశ్చలంగా, నిర్మలంగా ఉన్న పర్వత శ్రేణులు అపురూపంగా కనిపిస్తూనే– నెమ్మది నెమ్మదిగా చీకటి తెరల్లోకి వెళ్లిపోయాయి. పాపికొండలు దాటి వెనక్కి చూస్తే– అప్పుడే విరిసిన నెలవంక ఆ పర్వత రాజానికి చిన్న వెండి కిరీటంలా కనిపించింది. తలూపుతున్న చెట్లు నవ్వుతూ మాకు వీడ్కోలు చెప్పినట్టు అనిపించింది.

వస్తూ వస్తూ– 'ఇలాంటి చోట ఓ రెండ్రోజులైనా ఉండాలి' అన్నాడు ఓ మిత్రుడు. ఏమో.. ఆ కోరిక ఎప్పుడైనా నెరవేరుద్దో లేదో..! కానీ, ఈ ఒక్క సందర్శన మాత్రం ఎప్పుడు తలచుకున్నా మనసుకు అనంతమైన ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ ఇచ్చి తీరుతుంది.. ఈ యాత్ర మన మూలాల మీదా, మనుషుల మీదా గౌరవాన్ని, ప్రేమనీ పెంపొందిస్తుంది. ఇది గోదావరంత నిజం! ★

మా బడి

- ఎం. కళ్యాణి

ఉదయం నిద్ర లేచినప్పట్నుండి మనసు ఉత్సాహంతో ఉరకలు వేస్తోంది. అసలు నిద్ర లేవడం ఏంటి, రాత్రంతా పడుకుంటే కదా! ఎప్పుడెప్పుడు ఉదయం అవుతుందా? ఎప్పుడు స్కూల్‌కి వెళ్దామా అని ఒకటే ఆతృత. చాలా అందంగా తయారవుదామనుకున్నాను. కానీ వెళ్లేది పార్టీకో, ఫంక్షన్‌కో కాదు కదా అనిపించి కాస్త తగ్గించా. అంతా తయారయ్యాక అద్దంలో మరోసారి చూసుకున్నాను. ఆహా ఏమి హుందాతనం! నిన్నటి వరకు లేడిపిల్లలా గెంతిన నేనేనా? ఎంత ఆనందంగా ఉందో ఈ రోజు. అవును. నేను టీచర్‌గా జాయినవ్వాల్సిన మొదటి రోజు ఇవ్వాళ. ఎక్కడికో కాదు నేను చదివిన స్కూల్‌కే. అవును, అది నా స్కూల్. ఎప్పటికీ నాదే. ఈ మాట అనుకుంటుంటే ఎంత హాయిగా ఉందో. 'నా' అనే స్వార్థం కూడా ఇంత బావుంటుందా అనిపించింది మొదటసారి.

◆◆◆

అప్పుడే కొత్తగా ఆ బడిలో చేరాను. తరగతి గదిలో కూర్చోబెట్టి అమ్మ వెళ్తుంటే ఎంత ఏడుపొచ్చిందో నాకు. అంతా కొత్తగా, గోలగోలా ఉంది. అక్కడ అందరూ నాకంటే పెద్దవాళ్లలా, గయ్యాళి మొహాల్లా అనిపించారు. అనిపించడమేంటి? అది నిజమే. నెమ్మదిగా ఉన్నానని ఎంతమంది ఏడిపించారో. నాతోపాటు అశ్విని అనే అమ్మాయి ఉండేది. తను కూడా చాలా నెమ్మదిగా వుండేది. మా ప్లేసుల్లో వాళ్లు కూర్చున్నందుకు ఇదేంటని అడిగితే తిట్టేవాళ్లు. అందరూ కలిసి దెబ్బలాడేవాళ్లు. నోరున్నవాళ్లదే గెలుపు అని అప్పుడు అనిపించింది. కానీ అన్యాయం అనిపిస్తే మాత్రం ఊరుకునేదాన్ని కాదు.

మా డ్రిల్ టీచర్ అంటే మా స్కూల్లో అందరికీ హడల్. ప్రతి చిన్న విషయాన్నీ ఆమె దగ్గరికి తీసుకెళ్లేవారు. ఒకసారి మా లీడర్ క్లాసు చూస్తూ ఏవో తిని అక్కడే చెత్త వేసింది. అందరికీ చెప్పే నువ్వే అలా చేయడమేంటని అడిగాను. ఆ విషయంలో చాలా గొడవ జరిగింది. నన్ను ఈడ్చుకుంటూ డ్రిల్ టీచర్ దగ్గరికి తీసుకెళ్లింది. తీరా అక్కడ మేడమ్ లేరు. ఆ కోపంలో నన్ను చెంపమీద కొట్టింది. నా తరుపున మాట్లాడినందుకు అశ్వినిని కూడా కొట్టింది. అంతే మరుసటి రోజు వాళ్ల పేరెంట్స్, మా పేరెంట్స్ వచ్చి ఫిరాఉ్యదు చేశారు. మళ్లీ అప్పుడు కూడా అన్నీ అబద్ధాలూ, కట్టుకథలే చెప్పింది. మనుషులు ఇంత దారుణంగా వుంటారా అనిపించింది. కానీ టీచర్ వాళ్లనే తిట్టారు. 'ఇంకెప్పుడైనా సరే వాళ్ల జోలికి వెళ్తే ఊరుకోను' అని వార్నింగ్ ఇచ్చారు. అయినా గానీ ఆ రోజు నుండి వాళ్లవైపు చూడాలన్నా, మాట్లాడాలన్నా భయం వేసేది.

తరువాత జరిగిన పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని అందరి నోళ్లు మూయించాం. అప్పట్నుండి మాదే హవా. టీచర్లందరూ మాతో చాలా స్నేహంగా ఉండేవారు. మేం చెప్పిందే వేదం. అధికారికంగా లీడర్స్ వేరేవాళ్లైనా పెత్తనమంతా మాదే. అలా అని ఎప్పుడూ అన్యాయంగా ప్రవర్తించేవాళ్లం కాదు. కొన్ని రోజులకు రోహిణి అనే అమ్మాయి కొత్తగా మా క్లాసులో చేరింది. తను కూడా మా కోవకు చెందిందే. మొదట్లో మమ్మల్ని ఏడిపించినవారంతా తర్వాత మా పక్కన కూర్చోవాలని చూసేవారు. లోపల ఏమనుకునేవారో తెలియదు కానీ, పైకి మాత్రం మాతో స్నేహం చేయాలని చూసేవారు. మనుషులు అవకాశవాదులని అప్పుడు అర్థమైంది.

క్లాసులో మమ్మల్ని ర్యాంకుల ప్రకారం కూర్చోబెట్టేవారు. మేం ముగ్గురం ఎప్పుడూ ఫస్ట్ ప్లేస్ కోసం పోటీపడేవాళ్లం. ఒకటీ అరా మార్కుల తేడాతో మొదటి మూడు ర్యాంకులు మాకే వచ్చేవి. చదువులో ఎంత పోటీ ఉన్నా, మా స్నేహం చాలా ముచ్చటగా ఉండేది. ఇంచుమించు ముగ్గురి చేతిరాత ఒకేలా ఉండేది. ఒకరి పరీక్ష మరొకరు రాసినా అనుమానం రాదనేవారు మా టీచర్లు. ఎసైన్‌మెంట్లు, పరీక్షలు, డిబేట్లు, వ్యాసరచనలు ఏవైనా బహుమతులు మావే.

ఒకసారైతే మా లెక్కల మాస్టారు మమ్మల్ని అడగకుండా డిబేట్ కాంపిటీషన్లో మా పేర్లు ఇచ్చారు. ఇంకో గంటలో ప్రోగ్రాం ఉందనగా విషయం చెప్పారు. మా వల్ల కాదు, మేం వెళ్లమని బాగా పేచీ పెట్టాం. ధైర్యం చెప్పి మీకు ఏం తెలిస్తే అదే చెప్పమని పంపించారు. ఆ ధైర్యం ఇప్పటికీ మమ్మల్ని ముందుకు నడిపిస్తూనే ఉంది. ఆయన చెప్పే లెక్కలన్నీ ముందే చేసేసి మాట్లాడుకునేవాళ్లం. అందుకని మా ముగ్గుర్ని విడివిడిగా కూర్చోబెట్టారు. నన్ను ముందు వరుసలోఓ మూలకి, రోహిణిని తన ప్లేస్‌లో, అశ్వినిని వెనుక బెంచిలో కూర్చోబెట్టారు. అయినా సరే, మేం మాట్లాడాలనుకున్న మాటలు, వెయ్యాలనుకున్న సెటైర్లు ఒక పుస్తకమ్మీద రాసి అందించుకునేవాళ్లం. ఇది గమనించిన మాస్టార్లు మమ్మల్ని మళ్లీ ఒకేచోట కూర్చోబెట్టారు.

మాకు మొదట్లో ఇంగ్లీషు అసలు వచ్చేది కాదు. వాళ్లు పరీక్ష పెట్టడం, మాకు తోచిందేదో మేం రాయడం, టీచరుకు నచ్చిన మార్కులు వేయడం చేస్తుండేవారు. అంతే తప్ప ఏ రోజూ అదేంటో, ఎలా రాయాలో చెప్పలేదు మా టీచర్. మేం ముగ్గురం ఇంగ్లీషులో తప్పిన రోజులు కూడా వున్నాయి.

అలాంటి సమయంలో మా అవస్థ గమనించిన మా ఫిజిక్స్ మాస్టారు దగ్గర కూర్చోబెట్టుకుని ఎంతో ఓపికగా ఇంగ్లీషు గ్రామర్ అంతా నేర్పించారు. అసలు ఆయన్ని చూసిన తర్వాతే నాకు ఫిజిక్స్ మీద ఆసక్తి కలిగింది. ఎప్పటికైనా ఫిజిక్స్ టీచర్ అవ్వాలనుకున్నాను. జిల్లాలో ఎక్కడ సైన్స్ స్క్వేర్ జరిగినా అక్కడ మా ప్రయోగాలు ఉండాల్సిందే. ఆ ప్రిపరేషన్ అంతా మా మాస్టారిదే. పదవ తరగతిలో ఆయనే మాకు ట్యూషన్ చెప్పేవారు. ఒక్కొక్క సబ్జెక్టు ఒక్కొక్కరు చెప్పినా అన్నీ ఆయన చెబితేనే అర్థమయ్యేది. ఎక్కువగా క్విజ్ ప్రోగ్రాములు పెట్టి మాలో వున్న చురుకుదనాన్ని పెంపొందించిందీ ఆయనే.

సోషల్ టీచర్ మాతో ఎంత స్నేహంగా ఉండేవారో అంతబాగా చెప్పేవారు. ఏ దేశం ఎక్కడుందో, ఏ రాష్ట్రం ఏ దేశంలోదో నిద్రలో లేపి అడిగినా చెప్పేంతగా నేర్పించారామె. ఎంత బాగా రాసినా తెలుగులో మార్కులు ఎవ్వరికీ సరిగా వచ్చేవి కావు. కానీ మాకు ఒకటి అరా మాత్రమే తగ్గేవి. మా ఇంగ్లీషు టీచర్ గ్రామర్ అంతా మా చేతే చేయించేవారు.

కెమిస్ట్రీలో అయితే మేమే టీచర్లలా పేపర్లు దిద్దటం, నోట్సులు కరెక్ట్ చేయడం అన్నీ చేసేవాళ్లం. హిందీ పండిట్ పాఠం అంతా తెలుగులోనే చెప్పేవారు. మాకేమో హిందీలో వినాలని వుండేది. ఆమె తెలుగులో ప్రశ్నలు అడిగితే మేం హిందీలో

జవాబు చెప్పేవాళ్లం. దానికి కారణం మాకు తొమ్మిదో తరగతిలో హిందీ టీచర్ చాలా బాగా చెప్పేవారు. పదవ తరగతిలో కూడా ఆమే రావాలని కోరుకున్నాం. కానీ ఆమె రాలేదు.

ఇక మా డ్రిల్ టీచర్ సంగతి ముందే చెప్పాగా. ఆమెంటే అందరికీ హడలని. కానీ ఆవిడ మా చేత ఎన్నో ఆటలు ఆడించాలని చూసేవారు. అయితే మాకేదో సరదా ఆటలు తప్ప సీరియస్‌గా ఆడాలనిపించేది కాదు. డ్రిల్ పీరియడ్ మానేసి ముగ్గురం ఏదో ఒక ఎంటర్‌టైన్ చేసుకునేవాళ్లం. లేదా హోంవర్క్ చేసుకునేవాళ్లం. కానీ ఆవిడ ఒకసారి బలవంతంగా మాతో ఆడించారు. అప్పుడే నావేలు వంకరపోయి వంగడం మానేసింది. ఇప్పటికీ ఆ వేలు అలాగే ఉంది.

మా స్కూల్ గ్రౌండ్ చాలా పెద్దది. సెలవురోజుల్లో బయటి పిల్లలు కూడా వచ్చి అక్కడ క్రికెట్ ఆడుకునేవాళ్లు. వర్షం వచ్చినప్పుడు స్కూల్ మైదానమంతా మునిగిపోయేది. అక్కడక్కడ రాళ్లు వేసుకుని ఒకదాని మీద నుండి మరొకదాని మీదకు దూకుతూ తిరగేవాళ్లం. ఒక్కోసారి జోరుగా వర్షం కురుస్తుంటే టీచరు చెప్పే క్లాసు వినకుండా మేమందరం పాటలు పాడుకునేవాళ్లం. నిజానికి మేం చాలా అల్లరి చేసేవాళ్లం. కానీ అందరూ కృత్తిక, రోహిణి, అశ్వినిలు ఎప్పుడూ చదువుతూనే ఉంటారనుకునేవారు. చదివే సమయంలో కూడా ఎంతో అల్లరి చేసేవాళ్లం. ఆ అల్లరిలో అందం కనిపించేదే తప్ప విసుగు కలిగించేది కాదు. మీ అల్లరి చూస్తుంటే ముచ్చటేస్తుందని తరచూ టీచర్లందరూ అనేవారు.

ప్రార్థన ఎక్కువగా ఇంగ్లీషులో చెప్పేవాళ్లం. ఒక్కోసారి హిందీలో చెప్పమనేవారు. మాకు వచ్చినా తప్పులు పోతాయేమోనని చెప్పడానికి భయపడేవాళ్లం. కానీ ఒకసారి మా టీచర్ సడెన్‌గా నన్ను ముందుకు నెట్టారు. అందరూ నన్నే చూస్తున్నారు. మా టీచర్ కొంచెం మొదలుపెట్టాక ఎలా చెప్పానో తెలీదు, మొత్తం చెప్పేశాను. అందరూ మెచ్చుకున్నారు.

చివరి పీరియడ్స్ సరిగా జరిగేవి కావు. అప్పుడు హెడ్‌మాస్టర్ రౌండ్స్‌కి వచ్చి ప్రశ్నలు అడిగేవారు. నన్ను అడగమంటే నన్ను అడగమని పోటీ పడేవాళ్లం. ప్రశ్న పూర్తిగా అడగకుండా జవాబు చెప్పినందుకు తిట్లు కూడా తినేవాళ్లం. మా బయాలజీ సార్ అయితే వెళ్తూ వెళ్తూ క్లాస్‌కి వచ్చి ఒక తమాషా ప్రశ్న అడిగేవారు. జవాబు చెప్పిన వారికి తన చేతిలో ఉన్న చాక్లెట్టో, పెన్నో ఏదుంటే అది ఇచ్చేవారు. మా స్కూల్లో ఎన్.సి.సి, ఎన్.జి.సి ప్రోగ్రాములు బాగా జరిగేవి.

పదవతరగతిలో ఉండగా ఒక విచిత్రం జరిగింది. మా స్కూల్లో

ఎప్పుడూ ఒక్కరికే 500 దాటి మార్కులు వచ్చేవి. ఆ సంవత్సరంలో మాలో ఐదుగురికి వచ్చాయి. ఇన్నేళ్లలో మా స్కూల్ సాధించిన పెద్ద రికార్డు అదే. నేను ఎక్కువ ఇష్టపడి చదివింది స్కూల్లోనే. మనుషుల్ని, మనస్తత్వాల్ని, జీవితాల్ని, మంచితనపు విలువల్ని చదివింది అక్కడే. తర్వాత కాలేజీ చదువులు ఏం చదివానో, ఎలా చదివానో నాకే తెలీదు. అలా అలా గడిచిపోయాయి.

'ఇంక ఆలోచించింది చాలు. టైమయింది బయల్దేరు' అన్న అమ్మ మాటలతో ఈ లోకంలోకి వచ్చాను. ఎంత సంతోషంతో స్కూల్లో అడుగుపెట్టానో, అక్కడి వాతావరణాన్ని చూసి అంత షాక్ తిన్నాను. అప్పటినుండి అడుగడుక్కీ షాక్. మా స్కూల్ గ్రౌండ్‌లో ఈ సేవా కేంద్రం బిల్డింగ్ కట్టేశారు. ప్రేయర్ కూడా ఎవరి క్లాసులో వారు ఐదు నిమిషాలు చేసుకుంటున్నారు. ఆరా తీస్తే తర్వాత తెలిసింది. పిల్లలందరూ వచ్చి, లైన్లో నిలబడేటప్పటికి ఎక్కువ సమయం పడుతుందని అలా చేశారట. మేం చదివేటప్పుడు ఎన్.యు.పి.డబ్ల్యు అని ఒక పీరియడ్ ఉండేది.

కుట్లు, అల్లికలు నేర్పడానికి. కానీ అదెప్పుడూ జరగలేదు. ఎందుకంటే మాకు అది రిలాక్సింగ్ అవర్. కానీ ఇప్పుడు పిల్లలకి అలాంటి అవకాశం లేదు. ఉదయం నుండి సాయంత్రం దాకా చదువుతూనే ఉన్నారు.

అప్పట్లో భోజనం సమయం గంట ఉండేది. ఉదయం సాయంత్రం ఇంటర్వెల్ 10 నిమిషాలు ఉండేది. ఇప్పుడు అరగంట మాత్రమే. ఇంటర్వెల్ అసలే లేదు. ఇప్పుడు ఆ స్కూల్లో పి.ఇ.టి అవసరం కూడా లేదు. నేను చదివింది తెలుగు మీడియం. ఇప్పుడు ఇంగ్లీషు మీడియం మాత్రమేనట. ఇంటర్ అయ్యేంతవరకూ కంప్యూటర్ అంటే ఏంటో మాకు తెలీదు. కానీ ఇప్పుడు ఆరో తరగతి నుండే కంప్యూటర్ పాఠాలు చెప్తున్నారు.

గేటు దగ్గర తినుబండారాలు అమ్ముతూ ఒక తాత ఉండేవాడు. ఇప్పుడు అదే స్థలంలో ఒక చిన్న సైజు క్యాంటీన్ ఉంది. ఉదయం స్పెషల్ క్లాసులు, సాయంత్రం ప్రైవేట్ క్లాసులు అన్ని తరగతులవారికి చెప్తున్నారు. మాకైతే పదవతరగతిలో మాత్రమే ప్రైవేటు క్లాసులు పెట్టేవారు. అవి కూడా బోర్ అనిపించినప్పుడు తొందరగా రెండు ప్రశ్నలు అప్పజెప్పి వెళ్లిపోయేవాళ్లం. ఇప్పుడైతే హెచ్.ఎం. సార్ ఒక్కసారి కూడా ఆ రూమ్ వదిలి బయటికి వచ్చినట్లు కనిపించలేదు. మేం చదివినప్పుడు ప్రతినెలా మూడో శనివారం 'పచ్చదనం - పరిశుభ్రత' కార్యక్రమం జరిగేది. అందరూ కలిసి గ్రౌండ్ అంతా శుభ్రం చేసి మొక్కలు నాటి, నీళ్లు పోసేవాళ్లం. ఆ సమయంలో ఎన్నో మాటలు, జోక్స్.

కానీ ఇప్పుడవేమీ లేవు. అసలు చెట్లేలేవు. తమాషా ప్రశ్నల మాస్టారు లేరు. క్విజ్ ప్రోగ్రాములు, వ్యాసరచన పోటీలు ఏమీ లేవు. వరండాల్లో కూర్చుని గ్రూప్ డిస్కషన్ చేసే కృతిక, రోహిణి, అశ్విని లాంటి వారు అసలే లేరు. ప్రతి ఒక్కరి మొహం సీరియస్‌గా ఉంది. అందరూ పుస్తకంలో తలదూర్చే వుంటున్నారు. ఆరవ తరతగతి పిల్లాడు కూడా ఐ-సెట్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతున్నంత సీరియస్‌గా వున్నారు. ఎప్పుడూ చదువు, డైలీ టెస్టులు, వీక్లీ టెస్టులు. ఇంత చదివినా ర్యాంకులు మాత్రం రావడం లేదట.

ఒక్కసారిగా నా ఒళ్లు జలదరించింది. నేను నా స్కూల్‌ని కలలో కూడా ఇలా ఊహించుకోలేదు. అభివృద్ధి చెందిందనుకోవాలో, ఆనందాన్ని కోల్పోయిందనుకోవాలో నాకే అర్థం కాలేదు. నావల్ల కాదు. ఇలాంటి పరిస్థితుల్లో నా అనుకున్న ఈ స్కూల్లో టీచర్ ఉద్యోగం చేయలేను. వెంటనే ట్రాన్స్‌ఫర్ కోసం పరిగెత్తాను. ★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేదైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షిక, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.



మన ఆరోగ్యాన్ని రక్షించే నీరు

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

మన శరీరంలో నీటి శాతం తగ్గితే తల నొప్పి, గుండెలో మంట, ఎముకల నొప్పి, వెన్ను నొప్పి, ఊబకాయం వంటి రుగ్మతలు మొదలవుతాయి. శరీరానికి కావలసినంత నీరు తాగకపోతే ఆస్తమా, ఎలర్జీ, హైపర్‌టెన్షన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. అంతేకాదు రక్తనాళాల్లో కొవ్వు నిల్వ ఉండిపోతుంది. కొంచెం అధికంగా నీరు తాగడంవల్ల కిడ్నీలో రాళ్ళు, మలబద్ధకం వంటి వాటిని నివారించవచ్చు. రోజుకి కనీసం పదిగ్లాసుల నీరు, అంటే సుమారు రెండున్నర లీటర్ల నీరు తాగడం మంచిది. నీటికి క్యాన్సర్‌తో పోరాడే లక్షణం ఉందని ఇటీవల పరిశోధనల్లో వెల్లడయింది. అనుదినం నాలుగు గ్లాసుల కన్నా ఎక్కువ నీటిని తాగేవారికి పెద్ద పేగు క్యాన్సర్ వచ్చే అవకాశాలు బాగా తక్కువని తెలుస్తోంది. జీర్ణాశయం పేగులో నీరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా పనిచేస్తుందని, దానితో ఆరోగ్యానికి భంగం కలిగించేవి ఏవీ కడుపులో ఉండకుండా బయటికి గెంటేస్తుందని ఎపిడెమియాలజిస్ట్‌లు చెబుతున్నారు. పెద్దపేగు గోడల దగ్గర కార్సినోజెన్స్ నిల్వ ఉండడానికి చాలా తక్కువ సమయం ఉంటుంది. అందువల్ల అవి అక్కడ వుండలేవు. ఇదే ప్రభావం యూరినరీ ట్రాక్, బ్లాడర్, కిడ్నీ, యురిటర్ ఇంకా ఇతర అవయవాలపై ఉంటుంది. అందుకే నీరు వీటిని ఆరోగ్యంగా ఉంచగల్గుతుంది. ఉదాహరణకు ఎక్కువగా రక్షితనీటిని పంపుల ద్వారా సేకరించి తాగేవారిలో బ్లాడర్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు 80 శాతం వరకు తగ్గాయని, ఆ నీటిని తాగనివారిలో ఈ క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరిగాయని పరిశోధనల్లో వెల్లడైంది. నీటిని అధికంగా సేవించడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గిపోతాయిని పరిశోధనల్లో తెలుసుకున్నారు.

నీరు ఎక్కువగా తాగడం వల్ల శరీరం బరువు అదుపులో ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మనకు ఆకలేసినప్పుడు ఆహారం భుజిస్తాం. దానితో తాత్కాలికంగా ఆకలి నుండి విముక్తి పొందుతాం. కానీ శరీరంలో నీరు నిల్వ ఉండే సరైన మెకానిజం లేదు. అందుకే శరీరానికి దాహం వేసినప్పుడు కూడా ఆకలి వేసినట్లు ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నీరు ఎక్కువగా సేవించడం వల్ల డీహైడ్రేషన్ సమస్యలు ఉండవు. నీరు ఎక్కువగా తాగడం వల్ల సోడియం ఎక్కువగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. దీనివల్ల కెఫిన్ తగ్గుతుంది. అలా తగ్గకపోతే మందులు వాడాల్సివస్తుంది. మనం భుజించే ఘన ఆహారపదార్థాల ద్వారా దాదాపు ఒక లీటరు నీరు మన శరీరంలోకి ప్రవేశిస్తుంది. మిగిలిన నీటిని మనం తాగాల్సి ఉంటుంది. ఎండలో పని చేసేవారు అధికంగా నీరు తాగాలి. వాతావరణ ఉష్ణోగ్రత 18 డిగ్రీల సెల్సియస్ కన్నా అధికంగా ఉండే ప్రతి డిగ్రీ సెల్సియస్ అదనపు ఉష్ణోగ్రతకు 25 మిల్లీ లీటర్ల నీటిని అధికంగా తాగాలి. శరీరాన్ని వేడినుండి కాపాడుకోవడానికి, గుండె వేగాన్ని తగ్గించుకోవడానికి అనుదినం అదనంగా ద్రవపదార్థాలు తీసుకోవాలి. మనం సేవించే కాఫీ (కెఫిన్), ఆల్కహాల్ వంటివి మూత్రం ద్వారా వాటంతట అవి విసర్జితం కావు. ఇవి శరీరం నుండి బహిష్కృతం కావడానికి అదనంగా నీరు తాగాలి.

డీ హైడ్రేషన్

శరీరానికి కావలసిన నీరు తీసుకోకపోతే డీ హైడ్రేషన్‌కి గురవుతాము. డీ హైడ్రేషన్ వల్ల మనిషిలో బద్ధకం, స్పృహ పాక్షికంగా తగ్గడం, తీవ్రమైన అలసట కలుగుతాయి. శరీర బరువులో ఒకటి లేదా రెండు శాతం బరువుగల నీటిని శరీరం కోల్పోయిందంటే మానసికంగా, శారీరకంగా మన స్థితి గతి తప్పుతుంది. శరీర బరువులో ఏడు శాతం బరువుగల నీటిని శరీరం కోల్పోయిందంటే మరణం సంభవించే ప్రమాదం ఉంటుంది. డీ హైడ్రేషన్ బారిన మనిషి పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం. డీ హైడ్రేషన్ మెదడుకు రాకుండా జాగ్రత్త పడాలి. మెదడుకు ఎక్కువ నీరు అవసరం అవుతుంది. శరీరంలో నీటి శాతం తగ్గిపోవడం వల్ల సోడియం, పొటాషియం శాతం కూడా తగ్గిపోతుంది. ఫలితంగా మెదడుపై ఒత్తిడి పెరుగుతుంది. మెదడు దిగువున ఉన్న దాహం కేంద్రం రక్తంలో నీటి స్థాయి తక్కువగా ఉందని.తెలియజేస్తుంది. ఈ కేంద్రం అనేక నరాల కణాలతో నిండి ఉంటుంది. గొంతు తడి ఆరిపోయినప్పుడు కూడా దాహం కేంద్రం తెలుసుకుంటుంది. గొంతు తడారిపోవడంతో ఈ పొర దిగువున ఉన్న నరాలు ఉత్తేజితం కాబడి ఆ విషయం మెదడుకు తెలియజేస్తాయి. ఉత్తేజితమైన ఈ నరాలు పైపొరకు చల్లని నీరు తగలగానే సాధారణ స్థితికి వచ్చేలా చేస్తాయి. వేడినీటితో అంత తొందరగా సాధారణ స్థితికి రావు. ఎందుచేతనో శాస్త్రీయంగా ఇంకా స్పష్టంగా తెలియదు. అందుకే దాహం తీరేందుకు మనిషి చల్లటి నీరు తాగేందుకే ఇష్టపడతాడు.

డీ హైడ్రేషన్ నివారణ చర్యలు

- శరీరంలో నీటి పరిమాణాన్ని ఎవరికి వారే తమ మూత్రాన్ని బట్టి అంచనా వేసుకోవచ్చు. మూత్రం గాఢంగా, బంగారు వర్ణంలో వస్తుంటే శరీరంలో ద్రవాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించాలి. వెంటనే తగినంత నీరు తాగాలి.
- నీరు తాగడం మంచి అలవాటని గుర్తుంచుకోవాలి. మనం దాహం వేసినప్పుడు మాత్రమే నీరు తాగడానికి అలవాటు పడకూడదు. అలా చేయడం వల్ల శరీరానికి అవసరమయ్యే 50 లేదా 75 శాతం నీరు మాత్రమే లభిస్తుంది.
- శరీర బరువును బట్టి శరీరానికి కావలసిన నీరు ఆధారపడుతుంది. 150 పౌన్లు బరువుగల వ్యక్తి భారీగా వ్యాయామం చేయడం వల్ల చెమట రూపంలో 3 పౌన్ల నీటిని కోల్పోయాడనుకుందాం. అంటే అతని శరీర బరువులో 2 శాతం నీటిని నష్టపోయాడు. ఈ నష్టం అతని శారీరక, మానసిక సంయమనాన్ని బాగా దెబ్బతీస్తుంది.
- వ్యాయామం చేసేందుకు ఒక గంట ముందు ఒకటి లేదా రెండు గ్లాసుల నీరు తాగమని, వ్యాయామం అనంతరం ప్రతి 20 నిమిషాలకు కనీసం అరగ్లాసు నీరు తాగమని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు.
- శరీరంలోని రక్తంలో 92 శాతం నీరు, మెదడులో 75 శాతం నీరు, కండరాల్లో 75 శాతం నీరు, ఎముకల్లో 22 శాతం నీరు ఉంటాయంటే మనిషి శరీరంలో నీటి ప్రాముఖ్యత అర్థం చేసుకోవచ్చు.
- భూగోళంలో 70 శాతానికి మంచినీరు ఉన్నప్పటికీ చాలామంది దాని ప్రాముఖ్యతని పట్టించుకోవడం లేదు.
- శరీరం చురుగ్గా, ఉత్సాహంగా పనిచేయడానికి చాలినంత రక్షిత నీరు తాగాలి.
- మహిళల్లో పి.యం.ఎస్ (ప్రీ మెనుస్ట్రల్ సిండ్రోమ్) హార్మోన్ల సమస్య కారణంగా వస్తుంది. నీరు తగినంతగా తాగకపోవడం ఈ సమస్య తలెత్తడానికి ఒక కారణం. అందువల్ల తరచూ నీరు తాగడం మంచిది.
- కొంత మంది ఎక్కువగా నీరు తాగడానికి ఇష్టపడరు. ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా ఇదొక అవసరంగా భావించి నీరు తగాలి.
- బాగా మితిమీరి అవధులు దాటి విపరీతంగా నీరు తాగితే మరణం సంభవిస్తుంది. ఏదైనా అతి పనికిరాదు. ★

త్రీజీ

దశాబ్దం కిందట సొంతంగా మొబైల్ ఫోన్ వుండటమే ఓ విలాసం. ఇప్పుడు పరిస్థితి చెప్పక్కర్లేదు. జీవితంలో మొబైల్ ప్రాథమిక అవసరమై పోయింది. సాంకేతిక రంగంలో ఇదో విప్లవం. చేతిలో ఇమిడిపోయే ఈ ఫోన్‌లోనే మొబైల్ ఇంటర్నెట్ రూపంలో మరో విప్లవం చోటుచేసుకుంది. ప్రపంచం ఇక మీ అరచేతిలోనే. మొబైల్‌లోనే బ్రౌజింగ్, ఇమెయిల్స్, ఛాటింగ్, ఇ-బ్యాంకింగ్ వంటి అనేక ఫీచర్లు వుండడంతోపాటు దేశంలో 3జి సేవలు అందుబాటులోకి రావడంతో మొబైల్ ఇంటర్నెట్‌కు తెరలేచింది. అత్యంత వేగవంతమైన ఈ 3జి సేవల వలన మొబైల్ ఇంటర్నెట్ వినియోగదార్ల సంఖ్య మరింతగా ఊపందుకుంది. మొబైల్ ఇంటర్నెట్ మార్కెట్ పురోగతిపై ప్రపంచవ్యాప్తంగా "బిజ్‌సిటి" అనే సంస్థ ఓ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో మొబైల్ ఇంటర్నెట్ వినియోగంలో మొదటి పది దేశాల్లో మనదేశంతోపాటు చైనా కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకుంది.

ప్రపంచం మీ అరచేతిలోనే!

3జీ అంటే... సంక్షిప్తంగా 'థర్డ్ జనరేషన్ మొబైల్ టెలిఫోనీ'. వేగంగా సమాచార మార్పిడి చేసుకొనేలా మొబైల్ నెట్‌వర్క్‌లను, మొబైల్ ఫోన్లను రూపొందించారు. ప్రస్తుతం మొబైల్స్‌లో వాడుతున్న 2జీ టెక్నాలజీలో వేగాన్ని ఓ స్థాయి తర్వాత పెంచలేము. ఎక్కువగా వాయిస్, టెక్స్ట్ డేటాను మాత్రమే మార్పిడి చేసుకోగలుగుతున్నాం. ఒక్కమాటలో చెప్పాలంటే పూర్తిస్థాయిలో ఇంటర్నెట్ సేవల్ని మొబైల్‌లో వినియోగించుకునేలా రూపొందించిందే ఈ 3జీ. అరచేతిలో టీవీ! సినిమాలు, పాటలు, వార్తలు, ఓ మాదిరి సైజున్న వీడియో ఫైల్స్ ఏవైనా సరే చిటికలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

రానున్న కాలంలో మొబైల్ ఫోన్లోనే టీవీలూ చూడగలుగుతారు. దానికి ఎక్కువ రిజల్యూషన్‌తో కూడిన డిస్‌ప్లే సిస్టం, అధిక డేటాను వేగంగా రిసీవ్ చేసుకోగలగటం వంటి ఎక్కువ సౌకర్యాలతో కూడిన మొబైల్ ఫోన్లూ వస్తాయి. టీవీ ప్రోగ్రాంలను ప్రసారం చేయడానికి ఉన్న ఛానళ్లు సిద్ధమవుతాయి. కొత్త ఛానెళ్లూ, వెబ్‌సైట్లూ పుట్టుకొస్తాయి. నచ్చిన ప్రోగ్రాములను రికార్డ్ చేసుకొని ఫోన్‌లో భద్రపరచుకోవచ్చు కూడా.

ప్రస్తుతం మనం వినియోగిస్తున్న 2జీ ద్వారా వాయిస్ కమ్యూనికేషన్‌ను పూర్తిస్థాయిలో ఏ విధంగా వినియోగించగలిగామో వీడియో ఫైళ్లను 3జీలో అంతే సులువుగా యాక్సెస్ చేసుకొనేలా ఈ నెట్‌వర్క్‌లను, ఫోన్లను రూపొందిస్తున్నారు. వెబ్ కెమేరా ద్వారా కంప్యూటర్‌లో ఆన్‌లైన్ వీడియో ఛాటింగ్ ఎలా చేస్తున్నారో అదే విధంగా ఫోన్‌లో కూడా మీరు కనిపిస్తూ కబుర్లు చెప్పుకోవచ్చు. దీన్ని 'వీడియో కాలింగ్' అంటారు. ఇలా కనిపిస్తూ మాట్లాడాలంటే ఇరువురి ఫోన్లలో కెమేరా కచ్చితంగా వుండాలి. దీనికోసం ఫోన్ ముందు భాగంలో కెమేరాను ఏర్పాటు చేసిన 3జీ ఫోన్లను అందుబాటులోకి తెస్తున్నారు.

మూడు నిమిషాలున్న ఎంపీ3 పాటను 2జీతో డౌన్‌లోడ్ చేస్తే సుమారు 31నుండి 40 నిమిషాలు తీసుకుంటుంది. అదే వీడియోను 3జీతో 11 సెకన్ల నుంచి 1.5 సెకన్లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాహనాల్లో వెళుతున్నప్పుడు కూడా 384 కేబీపీఎస్ వేగంతో డేటాను డౌన్‌లోడ్ చేసేలా 3జీ పనిచేస్తుంది. 2జీ నెట్‌వర్క్ 10kb/sec వేగంతో సమాచార మార్పిడి చేస్తే, 3జీ 2mb/sec స్పీడ్‌తో చేస్తుంది. కంప్యూటర్‌లో పూర్తిస్థాయిలో ఇంటర్నెట్ బ్రౌజింగ్ చేసుకోవచ్చు. వివిధ రకాల మల్టీమీడియా గ్రాఫిక్స్‌తో కూడిన ఎటాచ్‌మెంట్లతో ఈ-మెయిళ్లను చిటికెలో పంపేయొచ్చు. అదేవిధంగా వీడియో కాన్ఫరెన్స్‌లు, ఫ్రెండ్స్‌తోనూ, కొత్త వాళ్ళతోనూ ఆన్‌లైన గేమ్స్, వీడియో గేమ్స్ అవలీలగా ఆడవచ్చు. దీంతోపాటు మల్టీప్లేయర్ గేమ్స్ కూడా మొబైల్స్‌లో అందుబాటులోకి రానున్నాయి. తక్కువ సమయంలోనే ఈ గేమ్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పోలీసు, రక్షణ వ్యవస్థలు ఈ నెట్‌వర్క్ ద్వారా సీసీటీవీలను యాక్సెస్ చేసే సదుపాయాన్ని అందుబాటులోకి తేనున్నారు. మొబైల్ టూరిజం, మొబైల్ వాణిజ్యం, ఈ-లెర్నింగ్, స్టాక్‌ఎక్స్ఛేంజ్, టెలీమెడిసిన్, మొబైల్ వాణిజ్య ప్రకటనలు సైతం రానున్నాయి. అయితే మొబైల్ ఫోన్లలో అందుబాటులోకి వచ్చిన ఈ అధునాతన టెక్నాలజీని సరైన విధంగా ఉపయోగించుకోవాలంటే సమర్థవంతమైన ఆపరేటింగ్ సిస్టమ్ కూడా వుండాలి. అదే ఆండ్రాయిడ్. దీన్ని ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ గూగుల్ రూపొందించింది. ప్రముఖ సెల్‌ఫోన్ తయారీదారులు తమ ఫోన్‌లలో ఉపయోగిస్తున్నారు. దీనిని స్వేచ్ఛాయుత సాఫ్ట్‌వేర్ లైనెక్స్ ఆధారంగా రూపొందించారు. ఇది మొబైల్‌లలో వినియోగించడానికి అనువుగా లైనక్స్‌లో ఉన్న కొన్ని ఫీచర్స్‌ను మాత్రమే పొందుపరిచారు.

వెబ్ విహారంలో దిగ్గజంలా కొనసాగుతున్న గూగుల్ సంస్థ ఆండ్రాయిడ్ ఓఎస్‌తో మొబైల్, టాబ్లెట్ కంప్యూటర్లలో తన హవా కొనసాగిస్తోంది. ఇప్పటి వరకూ మొబైల్ ఓఎస్ ఫ్లాట్‌ఫాంలో ఎదురులేకుండా కొనసాగిన 'నోకియా సింబియాన్ ఓఎస్'ను వెనక్కి నెట్టి ఆండ్రాయిడ్ మొదటి స్థానంలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా రోజుకు 3,00,000 ఓ.ఎస్ యాక్టివేషన్స్‌తో రికార్డు సృష్టిస్తోంది. 27 కంపెనీలకు చెందిన 170 మోడల్ మొబైళ్లలో ఆండ్రాయిడ్‌ను ఇన్‌బిల్ట్ ఓఎస్‌గా అందిస్తున్నారు. "ఆండ్రాయిడ్ మార్కెట్ స్టోర్"లో సుమారు 1,50,000 అప్లికేషన్లను అందుబాటులో ఉంచారు. ఆండ్రాయిడ్ 2.3, 2.2, 2.0, 1.6 వెర్షన్లు అరచేతిలో అద్భుతాలు చేస్తున్నాయి. పీసీలో టాస్క్‌మేనేజర్ మాదిరిగా 2.3 వెర్షన్‌లో "పవర్ మేనేజ్‌మెంట్ సిస్టం"తో మొబైల్‌లోని అప్లికేషన్ల వివరాల్ని సైతం చూడొచ్చు. డిస్‌ప్లే, బ్యాటరీ సామర్థ్యం, ఓఎస్ అప్లికేషన్లు, వెబ్ సర్వీసులు... ఇలా బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతున్న వాటిని జాబితాగా చూడొచ్చు. అక్కర్లేని వాటిని ఇట్టే తొలగించవచ్చు. వేగంగా కీబోర్డ్‌తో ఇన్‌పుట్ ఇవ్వడం మాత్రమే కాకుండా కాపీ, పేస్ట్ చేయవచ్చు. "డౌన్‌లోడ్ మేనేజ్‌మెంట్"తో బ్రౌజర్ నుంచి డౌన్‌లోడ్ చేస్తున్న వాటిని మోనిటర్ చేయవచ్చు. వీడియోలను చూసేందుకు సులభమైన ఇంటర్ఫేస్‌ను ఏర్పాటు చేశారు. 2.2 వెర్షన్‌తో ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ జీమెయిల్ ఎకౌంట్‌లను యాక్సెస్ చేసే వీలుంది. క్విక్ కాంటాక్ట్స్ ఆప్షన్‌తో మెయిల్ ఐడీలను వెతకొచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే టేబుల్‌పైనున్న కంప్యూటర్ అల్లావుద్దీన్ అద్భుతదీపంలా అరచేతిలో ఇమిడిపోయింది. అనేక సంస్థలు రకరకాల మొబైల్ వెర్షన్‌లను అందుబాటులోకి తెస్తున్నాయి. శ్యామ్‌సంగ్ గెలాక్సీ యాస్, సోనీ ఎరిక్సన్ ఎక్స్‌పర్టియా, ఎల్‌జీ ఆప్టిమస్ ఒన్, శ్యామ్‌సంగ్ గెలాక్సీ 3, హెచ్‌టీసీ డిజైర్ ఆండ్రాయిడ్ ఫోన్, మోటరోలా మైల్‌స్టోన్ మొబైల్స్ ఆండ్రాయిడ్ ఓఎస్ వెర్షన్లతో దేశంలోని వినియోగదారుల్ని ఎక్కువగా ఆకట్టుకుంటున్నాయి.

- కె.ఎక్స్.రాజు

7			2	3	8		4	
			5					
	2	5				9		
	6			4				9
	3			8			7	
9				2			5	
		3				1	9	
					9			
	1		8	6	4			5

సుడోకు నింపేద్దాం

నేస్తాలూ.. ఇక్కడ ఓ పెద్ద బాక్సు, అందులో తొమ్మిది చిన్న చిన్న బాక్సులు ఇచ్చాం. వాటిలో కొన్ని అంకెలు కూడా ఇచ్చాం. మీరేం చేయాలంటే చిన్న బాక్సుల్లో 1 నుండి 9 వరకు అంకెలు వేయాలి. వేసిన అంకె మళ్లీ వేయకూడదు. అలా తొమ్మిది చిన్న బాక్సులు నింపేయాలి. సరేనా...

క్విజ్‌మాస్టర్

1. సైన్స్‌క్లబ్, భారత రైల్వే కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న 'సైన్స్ ఎక్స్‌ప్రెస్' మన రాష్ట్రానికి ఎప్పుడు వచ్చింది?

2. ఈ నెల 20వ తేదీన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయోగించిన ఉపగ్రహం పేరు ఏమిటి?



3. 2011 క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో ఫైనల్‌లో ఏయే దేశాలు తలపడ్డాయి. గెలిచిన దేశం ఏది?

4. మాథమాటిక్స్‌లో అబాకస్‌ను ఏ దేశం వారు కనుగొన్నారు?

5. ఇంగ్లీషు అక్షరాలలో A,E,I,O,U లను ఏమంటారు?

-ఎం. సురేఖ, 5వ తరగతి, హైదరాబాద్.

మీరూ ఇలా 5 ప్రశ్నలు, జవాబులు రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా : క్విజ్ మాస్టర్, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.



ఎవరా ఒక్కరు?!

బుజ్జాయిలూ... పై బొమ్మలో ఒక్కో లైన్లో నలుగురు ఉన్నారు. చూడ్డానికి ప్రతి వరుసలో ఉన్నవారంతా ఒకేలా కనిపిస్తున్నారు కదూ. కానీ ఆ నలుగుర్లో ఒక్కరు కొంచెం తేడాగా ఉంటారు. ఆ ఒక్కరిని కనిపెట్టి సున్నా చుట్టేయండే...

నేర్చుకుందామా...



తప్పులెక్కడ?

హాయ్... కింది బొమ్మ భలేగా ఉంది కదా. అయితే ఆ బొమ్మలో ఆరు తప్పులున్నాయి. అవి ఏంటో కనిపెట్టి చెప్తారుగా.



గూడు కుట్టే పక్షి

పిల్లలూ... ఇవాళ దర్జీ పక్షి గురించి చెప్పుకుందాం. ఇది చాలా చురుగ్గా, ఉత్సాహంగా ఉంటుంది. దీని శరీరంలో పైభాగం లేత ఆకుపచ్చ రంగులో, అడుగు భాగం తెల్లగా ఉంటుంది. తలేమో చాక్లెట్ రంగులో ఉంటుంది. ఇక తోక భాగంలో ఈకలు సూదుల్లా మొనదేలి ఉంటాయి. ఇది ఎక్కువగా ఒంటరిగా, లేకపోతే జంటగా ఉంటుంది. అంతే కానీ గుంపులో మాత్రం తిరగదు. మామూలుగా పక్షులు గడ్డితోనో, పుల్లలతోనో గూళ్లు కట్టుకుంటాయి. కానీ దర్జీ పక్షి గూటిని చూసి ఆశ్చర్యపోవాల్సిందే. ఇది గూటిని కట్టుకోడానికి ఒక పెద్ద ఆకుని తీసుకుంటుంది. దాని అంచులు దగ్గరగా చేర్చి గూడు ఆకారంలో కుట్టేస్తుంది. కుట్టడానికి ఇది దేన్ని ఉపయోగిస్తుందో తెలుసా? దూదిని గానీ, నారను గానీ పేని దారంలా చేస్తుంది. ఈ దారాలు ఊడిపోకుండా ముడి కూడా వేస్తుంది. గూటికోసం క్రోటను మొక్కల ఆకులను తీసుకుంటుంది. ఇది చాలా త్వరగా మచ్చికౌతుంది. దీని ఆహారం పూలకుండీల్లో, చెట్ల పొదల్లో ఉండే చిన్న చిన్న ఆకు పురుగులు, కీటకాలు. పూలతేనె అంటే చాలా ఇష్టం. అందులోనూ ఎర్రటి పూలతేనె అంటే మరీ ఇష్టం. ఇది తడవకి మూడు, నాలుగు గుడ్లను పెడుతుంది. ఇవి లేత నీలం కలిసిన తెలుపురంగులో ఉంటాయి.



ఎన్ని వాహనాలు?

ఒక షాపులో నెలకు 40 వాహనాలను రిపేరు చేస్తారు. అక్కడ మొత్తం 100 చక్రాలున్నాయి. వాటిలో ఎన్ని కార్లున్నాయి? ఎన్ని మోటారు సైకిళ్లున్నాయి?



ఏది సరిపోతుందో

ఫ్రెండ్స్... పక్కన తొమ్మిది ఆకారాలు ఉన్నాయి చూశారుగా. కింద మరో చిన్న ముక్క వుంది. ఈ చిన్న ముక్క పైనున్న వాటిలో ఎందులో పెడితే సరిగ్గా సరిపోతుందో చూసి అందులో పెట్టేయండి మరి.



ఎంత మంది కూలీలు?

ఐదుగురు కూలీలు ఐదుమీటర్ల గొయ్యిని ఐదు గంటల్లో తవ్వారు. అయితే 100 మీటర్ల లోతు గొయ్యిని 100 గంటల్లో తవ్వడానికి ఎంతమంది కూలీలు కావాలి?



జవాబులు

సుడోకు:

7	9	1	2	3	8	5	4	6
3	4	6	5	9	1	8	2	7
8	2	5	4	7	6	9	1	3
5	6	2	1	4	7	3	8	9
1	3	4	9	8	5	6	7	2
9	7	8	6	2	3	4	5	1
6	8	3	7	5	2	1	9	4
4	5	7	3	1	9	2	6	8
2	1	9	8	6	4	7	3	5

ఎన్ని వాహనాలు : 10 కార్లు, 30 మోటారు సైకిళ్లు. 10 కార్లు×4=40 చక్రాలు, 30 మోటారు సైకిళ్లు×2=60 చక్రాలు. మొత్తం 100 చక్రాలు. **ఎంతమంది కూలీలు?!**: ఐదుగురు కూలీలే. ఎందుకంటే ఒక కూలీ ఒక గంటలో ఒక మీటరు లోతు గొయ్యి తవ్వగలడు. కనుక 100 మీటర్ల గొయ్యిని తవ్వడానికి 100 గంటలే పడుతుంది. **ఎవరా ఒక్కరు?!** : 3,4,3. **క్విజ్‌మాస్టర్**: 1. ఏప్రిల్ 18, 2. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి)- సి16, 3. శ్రీలంక, భారత్ పోటీ పడ్డాయి. భారత్ గెలిచింది, 4. చైనా దేశస్తులు, 5. ఓవెల్స్ (vowles) **తప్పులెక్కడ?**: 1. పక్షి తలకిందులుగా ఉంది, 2. బాబు పెట్టుకున్న కళ్ల జోడుకు అద్దాలు మాత్రమే ఉన్నాయి, 3. చేప నేలమీద ఉంది, 4. క్రిస్మస్ చెట్టుకు కొన్ని బల్బులు తలకిందులుగా ఉన్నాయి, 5. గొడుగు తలకిందులుగా పట్టుకున్నాడు, 6. పండ్ల బుట్టలో చెయ్యి వుంది. **ఏది సరిపోతుందో**: 1.

మాటల కోట - 50

రూపకల్పన : కర్లపాలెం

■	■	1	2	■	3	4	■	■
■	■	5		■	6		■	■
7		■		■		■	8	
■	■	9		10			■	■
11	12	■	■		■	■	13	
■	14	15		■	16	17		■
18			■	19	■	20		
■	■	21	22		23		■	■
■	■	24		■	25		■	■

నిలువు :

1. నాయన, అలీ.... 40 దొంగలు (2)
2. మంచి కారు గల ఊరు (4)
3. పాడు కల (4)
4. ఇంగ్లీషు తొట్టి (2)
10. రేడియో అంటే ఆకాశ.... (2)
12. ద్రౌపదిని ఇలా కూడా అంటారు (3)
13. కూర ఆవిరైంది (3)
15. రైట్ సోదరుల సృష్టి (4)
17. పూలరంగడి విలాసం (4)
19. సేవకుడు చేసేది (2)
22. సంపాదన అంటే ఇవి నాలుగు వెనకేయడమే (2)
23. అమెరికాలో తెలుగు సభ (2)

అడ్డం :

1. అందరికీ తెలియాలంటే ఇది ఊది చెప్పాలి (2)
3. విడదీయడానికి కష్టమైన ముడి (2)
5. వరస (2)
6. గుండె చేసే శబ్దం లబ్... (2)
7. ఒకటికి రెండు తోడైతే ఏమవుతుంది ? (2)
8. 'సుత్తి' ద్వయంలో ఒకరు (2)
9. సెక్రటేరియట్ తెలుగులో (5)
11. రాజు లేని 'ధర్మజుని తండ్రి' తిరగబడ్డాడు (2)
13. ఇల్లాలి రాజ్యం (2)
14. మండపం (3)
16. ఇంగ్లీషు సమావేశం (3)
18. అటునుండి వేసిన దండ (3)
20. సాగిన గుర్తు (3)
21 నండూరి రామ్మోహనరావు గారి అవతారం (5)
24. ఇవి లేని గులాబీని ఊహించగలమా! (2)
25. జూనియర్ ఎన్‌టిఆర్ సినిమా. తప్పు చెప్తే బుస్సుమంటుంది సుమా! (2)

మాటలకోట - 49 జవాబు

1 తి	క్క	న	■	■	■	2 శ	న	3 గ
రు	■	■	4 ఆ	5 రు	6 ద్ర	■	■	దా
ప	■	■	7 క	కు	వి	■	■	ఫీ
8 తి	9 ర	10 గ	లి	■	11 డ	12 మ	13 ఆ	■
■	14 చ	ట్టి	■	■	■	15 సా	న	■
■	16 న	గా	17 రా	■	18 చ	ల	ప	19 తి
20 పా	■	■	21 గ	22 త	ము	■	■	రు
న	■	■	23 ము	గ్గు	రు	■	■	నా
24 కం	గా	రు	■	■	■	25 కూ	తు	ళ్ళు

కప్పల పెళ్లి

అనగనగా ఓ కప్ప. దానికి నా అన్నవాళ్లెవరూ లేరు. అందుకే దాన్నెవరూ పట్టించుకునేవారు కాదు. స్నేహితులంతా "పెళ్లికాని కప్ప" అని ఎగతాళి చేసేవారు. దీంతో కప్పకు భలే కోపమొచ్చేది. తనను పట్టించుకోని ప్రజల్ని, స్నేహితుల్ని నానా అగచాట్లు పడేలా చేయాలనుకుంది. అందుకోసం వానదేవుడి దగ్గరకు వెళ్లింది. అదే సమయంలో వానదేవుడు బయటకు రావడానికి తయారవుతున్నాడు.

బయటికొస్తే వాన కురిపించి జనానికి మేలు చేస్తాడు. చచ్చినా రానీయకూడదనుకుని "నాకు పెళ్లయ్యేదాకా నువ్వు ఇంట్లోనుండి కదలడానికి వీల్లేదు" అని అమాంతం గొళ్లెం పెట్టి తాళం వేసింది. తాళంచెవిని తీసుకెళ్లి సముద్రం అడుగున ఓ రాయి కింద దాచిపెట్టి, చక్కగా తన ఊరు వెళ్లింది.

వర్షాలు లేక ప్రజలు, నీళ్లు దొరక్క పశువులు అల్లాడసాగాయి.

వర్షాలకోసం పట్టణాల్లో యజ్ఞయాగాలు చేస్తున్నారు. పల్లెటూళ్లలో గ్రామ దేవతలను కొలుస్తున్నారు. పేరంటాలపల్లిలో పిల్లలంతా కలిసి రాయి కింద నక్కిన రెండు కప్పల్ని పట్టుకున్నారు. అందులో ఒకటి ఆడకప్ప, మరొకటి మన పెళ్లికాని మగకప్ప. ఆ రెంటినీ కలిపి ఒక కర్రకు తలకిందులుగా తాడుతో వేలాడదీశారు. చుట్టూ వేపాకు మండలు కట్టి, కప్పల మధ్య ఒక పసుపుతాడు పెట్టి దాని మీద బిందెడు నీళు కుమ్మరించారు. బట్టలు విడిచి బుడ్డగోసులు పెట్టుకున్నారు. ఆ కర్రని ఇద్దరు పిల్లలు చెరోవైపు భుజం మీద పెట్టుకుని మోస్తూ, ప్రతి ఇంటి ముందుకు వెళ్తున్నారు. వెనకున్న పిల్లలంతా "కప్పతల్లీ నీళ్లాడే, కడవల నిండా నీళ్లొచ్చే, వాన దేవుడో... వాన దేవుడా..." అని పాడుతూ వాళ్లను అనుసరించసాగారు. ఇంటి దగ్గరకు పిల్లలు రాగానే, ఆడవాళ్లు బిందెనిండా పసుపు నీళ్లు తెచ్చి, కప్పల మీద, పిల్లల మీదా గుమ్మరిస్తున్నారు. బిందె బోర్లేసి కప్పతల్లికి దండం పెట్టి వానలు కురవాలని మొక్కుకుంటున్నారు. తర్వాత పిల్లలకు రూపాయి, రెండు రూపాయలు చేతిలో పెట్టి దీవించసాగారు.

పెళ్లి కాని కప్పకు చాలా ఆనందంగా ఉంది. అది గాల్లో ఊగుతూ ఆడకప్పను చూసి పాటలు పాడుతోంది.

ఆడ కప్పేమో ఏడుస్తోంది. మగకప్ప కంగారుగా "పెళ్లవుతుంటే సంతోషించక ఏడుస్తున్నావు ఎందుకు?" అంది ఆశ్చర్యంగా.

"మా అమ్మ ఇంట్లో లేనప్పుడు, ఈ రాలుగాయి పిల్లలు బలవంతంగా నన్ను పట్టుకొచ్చారు. ఇల్లు విడిచి ఇప్పటి వరకు నేనెక్కడికీ వెళ్లలేదు. పరాయి మగాళ్లతో మాట్లాడితే మా అమ్మ వీపు చీరేస్తుంది. ఇంటికి తిరిగొచ్చి నా కోసం ఎంత వెతుకుతుంతో, ఏమో....?" అంది వెక్కివెక్కి ఏడుస్తూ.

"ఈ మాత్రం దానికేనా? నేనున్నానుగా మీ అమ్మతో చెప్పడానికి. అయినా పరాయి మగాళ్లయితే కొట్టుద్దేమోగానీ, నాతో మాట్లాడితే కొట్టదులే. నేను నీ భర్తని. ఈ పిల్లలు బాల బ్రహ్మలు. మనకు పసుపునీళ్లతో స్నానం చేయించి, వేద మంత్రాల్లా పాటలు పాడుతున్నారు. ఇక తాళిబొట్టు కట్టుకుని కాపురం చేయమని, మన మధ్య ఈ పసుపుతాడు వేలాడదీశారు" అని పసుపుతాడును ఆడకప్ప మెడలో వేసింది.

ఊరంతా తిరిగి ఆడుకుంటున్న పిల్లలకు చిల్లర పైసలతో జేబు నిండిపోయింది. ఇంక చాలనుకుని కర్రను ఊరిబయట పడేశారు.

"నాకు పెళ్లి కాదు గానీ, ఏ కాకో, గద్దో చూసిందంటే నా పని అయిపోయినట్లే. ఈ పిల్లలు పట్టుకొచ్చినంత మర్యాదగా వదిలిపెట్టరేం? దేవుడా... పెళ్లి లేకపోయినా పర్వాలేదు కానీ, ప్రాణం రక్షించు" అని మగ కప్ప వేడుకుంది. ఆడ కప్ప "అమ్మా... అమ్మా..." అని అలుపు లేకుండా ఏడుస్తోంది. పిల్లలంతా బట్టలు వేసుకుని ఊళ్లోకి వెళ్తున్నారు. వచ్చిన డబ్బులతో పీచుమిఠాయి అమ్మే కోంటి పుల్లయ్య దుకాణానికి పరుగందుకున్నారు. అలా పరిగెత్తేటప్పుడు బండోడి నిక్కరు గుండీలు ఊడిపోయి కిందకి జారింది. పకపకా నవ్వాడు బోడిగుండోడు. అది చూసిన బండోడికి పౌరుషం పొడుచుకొచ్చింది. కప్పల్ని కట్టిన తాళ్లని విప్పి నిక్కరుకి కట్టుకున్నాడు. అప్పటికే దోస్తులంతా మూలమలుపు తిరగడంతో, వెనకబడితే మిఠాయి దొరకదని దౌడందుకున్నాడు బండోడు.

కప్పలు రెండూ స్వేచ్ఛాజీవులయ్యాయి. "మనకు పెళ్లయింది. ఇంక మనింటికి పోదా పద" అంది మగకప్ప.

"వర్షమేది?" అంది వింతగా ముఖం పెట్టి ఆడకప్ప.

"మా ఇంటికెళ్లడానికి వర్షమెందుకు?" అంది మగకప్ప.

"వర్షం కురుస్తుండగా, బెకబెకమని ఆనందంగా అరుస్తూ భర్తవెంట మెట్టినింటికి కాపురానికి వెళ్లడం మా ఆచారం. వర్షం కురవనిదే నేను రావడం కుదరదు. అలా వస్తే మనకి కుంటి కప్పలు, కళ్లు లేని కప్పలు పుడతాయని మా అమ్మ చెప్పింది" అంది బుంగమూతి పెట్టి.

"ఓసి నీ ఆచారం గూల. చంపుతున్నావు కదే. ఇప్పడే వర్షం కురిపిస్తా. ఇక్కడే ఉండు" అని గంతులు పెడుతూ సముద్రంలోకి దూకింది. రాయి కింద దాచిపెట్టిన తాళం చెవి తీసుకుని వానదేవుడి ఇంటికి వెళ్లి తాళం తీసింది.

అప్పటి వరకు విశ్రాంతి తీసుకుంటున్న వానదేవుడు తలుపు చప్పుడవడంతో మెల్లగా లేచాడు. అప్పటికే ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్మి ఉండడంతో కుండపోతగా వర్షం కురవసాగింది.

"అయ్యయ్యో... వానదేవుణ్ణి అనవసరంగా బయటికి వదిలానే. బాగా మబ్బులు పట్టి వున్నాయి కాబట్టి ఆయన్ని విడుదల చేయకపోయినా వాన పడేదే" అనుకున్నా కొత్త పెళ్లాం సంగతి గుర్తొచ్చి ఆ ఆలోచనకు అంతటితో స్వస్తి చెప్పింది.

ఆ వర్షంలో బెకబెకమంటూ కప్పలు రెండూ ఇంటికి నడిచాయి. చాలా కాలానికి వర్షం పడడంతో ప్రజలంతా పులకించి పోయారు. పిల్లలు, పెద్దలు వర్షంలో తడుస్తూ ఆనందంతో పాటలు పాడుతూ, చిందులు వేశారు.

- పుప్పాల కృష్ణమూర్తి



మరుగుజ్జుల ప్రపంచం

ఇరుగుపొరుగు సూటిపోటి మాటలు, ఆకలి వారికి ఆమడ దూరంలో వుంటాయి. ఎందుకంటే వారిది వేరే ప్రపంచం కనక. చిట్టిపొట్టి మనుషులూ పుట్టగొడుగుల్లాంటి ఇళ్లూ...చిన్న చిన్న వంట సామగ్రి.. వస్తువులు...అదో లోకంలే! ఇంతకీ ఆ మరుగుజ్జు లోకం ఎక్కడుందంటే... చైనాలో. వీరు మిగతా మరుగుజ్జుల్లా ఆత్మన్యూనతతో బాధపడరు. తమ లోపం కారణంగా పనులు దొరక్క ఆకలితో అలమటించిపోరు. తమలాంటి మనుషుల మధ్యే హాయిగా ఆటపాటల్లో జీవనం సాగిస్తుంటారు. ఇదే వారి ఆదాయ మార్గం కూడా.

ఈ సంతోషం...ఈ ఆనందం అంతా చైనావాసి చెన్‌మింగ్ చలవే. మిగతావారిలా మరుగుజ్జులు కూడా జీవించాలన్న చెన్ ఆలోచనకు రూపమే ఈ డ్వార్ఫ్ కింగ్‌డమ్ (పొట్టివాళ్ల రాజ్యం) అనే థీమ్ పార్క్. వీరు వుండడానికి చిన్న చిన్న ఇళ్లు కట్టించాడు. లైట్ స్విచ్చులు, నీళ్ల ట్యాపులు, మంచాలు, కుర్చీలు, సింక్‌లు అన్నీ వారికి అందుబాటులోనే వుంటాయి. ఇక్కడ వీరు చేసే పనేంటంటే పార్కుకు వచ్చేవారిని తమ ఆటపాటలతో అలరించడమే.